**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 50, పేజీలు - 08

శనివారం, ఆగష్టు 15, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






## 'ఇన్వెస్ట్ తెలంగాణ'
# థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్

**- కేబినెట్ లో నిర్ణయం కీలక నిర్ణయాలు**

- సచివాలయంలో సీఎం రేవంత్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం
- డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 సదస్సు
- సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుకు నిర్ణయం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశం రాష్ట్ర భవిష్యత్‌పై స్పష్టమైన దిశానిర్దేశం చేసింది. సుమారు మూడు గంటలపాటు సాగిన ఈ భేటీలో పారిశ్రామిక అభివృద్ధి, ప్రజా సంక్షేమం, వ్యవసాయం, విద్యారంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అటు సామాన్యులకు ఊరటనిచ్చేలా, ఇటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగుల పెట్టించేలా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0

తెలంగాణను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్‌గా మార్చే లక్ష్యంతో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ మెగా సదస్సును ఈ ఏడాది డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈసారి ఇన్వెస్ట్ తెలంగాణ అనే ప్రధాన నినాదంతో ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ముఖ్యంగా డిఫెన్స్, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. సదస్సు విజయవంతం కోసం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, వివేక్ వెంకటస్వామిలతో కూడిన ప్రత్యేక సబ్‌కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ వేదికపై ప్రభుత్వం తన ప్రతిష్టాత్మక ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రపంచానికి ఆవిష్కరించనుంది.

### సామాన్యులకు స్మార్ట్ రేషన్ కార్డు

రాష్ట్ర ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ముహూర్తం ఖరారైంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15 మధ్యాహ్నం నుంచి రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ప్రారంభంకానుంది. పాత కార్డులతో కలిపి రాష్ట్రంలో మొత్తం 3 కోట్లకుపైగా రేషన్ కార్డులు అందుబాటులో ఉండనున్నాయి. నిరుపేదలకు పారదర్శకంగా సరకులు అందేలా ఈ స్మార్ట్ కార్డులను రూపొందించారు.

### హైదరాబాద్‌లో ఈవీ ఆటోలు భారీ ఊరట

హైదరాబాద్ సిటీని గ్రీన్ సిటీగా మార్చే దిశగా కేబినెట్ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ఆటో రిక్షా ఎలక్ట్రిక్ కన్వర్షన్ స్కీమ్ కోసం 200 కోట్లు కేటాయించారు.

2లో..

## ఇది నాకూ విద్యార్థులకూ
# మధ్య విషయం

**- బీసీఐ నిర్ణయంపై సీజేఐ సూర్యకాంత్ సంచలన కామెంట్లు**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని ప్రముఖ నాల్సార్ లా విశ్వవిద్యాలయం 2026 గ్రాడ్యుయేట్ విద్యార్థుల నమోదును నిలిపివేస్తూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) జారీ చేసిన ఆదేశాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసేలా ఉన్న ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచిస్తూ ఈ విషయంలో అనవసరంగా తలదూర్చవద్దని బీసీఐకి ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్య కాంత్ మిశ్రా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఇది నాకూ విద్యార్థులకు మధ్య విషయం అని తేల్చి చెప్పారు. దీంతో బీసీఐ ఆ వివాదాస్పద ఆదేశాలను వెంటనే ఉపసంహరించుకుంది.

### అసలేం జరిగిందంటే.?

నాల్సార్ విశ్వవిద్యాలయ కాన్వొకేషన్‌కు ప్రధాన న్యాయమూర్తి హాజరు కావడాన్ని నిరసిస్తూ కొందరు విద్యార్థులు చేపట్టిన ప్రచారాన్ని తీవ్రంగా పరిగణించిన బీసీఐ దీనిపై విచారణ పూర్తయ్యే వరకు 2026 బ్యాచ్‌లోని ఏ ఒక్క విద్యార్థినీ న్యాయవాదిగా ఎన్‌రోల్ చేయవద్దని దేశంలోని అన్ని స్టేట్ బార్ కౌన్సిళ్లను ఆదేశించింది. దీనికి తోడు ప్రచారానికి సూత్రధారులైన వారి వివరాలపై నివేదిక ఇవ్వాలని వైస్ ఛాన్సలర్‌ను కోరింది. అయితే సుప్రీం కోర్టు

2లో..

## విద్యావ్యవస్థను సమూల
# ప్రక్షాళన చేశాం

- హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్‌లో జ్యోతిబా ఫులే, సావిత్రీబాయి ఫులే దంపతుల విగ్రహావిష్కరణ
- ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి
- యంగ్ ఇండియా స్కూళ్ల ద్వారా విప్లవాత్మక మార్పు తీసుకొచ్చామన్న సీఎం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ఇకనుంచి ప్రతి ఏటా అడ్వాన్స్‌గా విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థులు ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి డబ్బులను



2లో..

**హిందూ కుటుంబాలను వేధిస్తూ.. మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?**

**- బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఫైర్**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాతబస్తీలో విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఉచిత విద్యుత్ పథకం అమలుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు.

2లో..

# యుద్ధప్రాతిపదికన పోలవరం పనులు

**- సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు**

- పోలవరం, వెలిగొండ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష
- 89.9 శాతం మేర పోలవరం సివిల్ పనులు పూర్తయినట్టు వెల్లడి
- ప్రాధాన్యతా క్రమంలో 36 ప్రాజెక్టులు పూర్తి చేయాలని నిర్ణయం
- గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ పనులు చేపట్టాలని ప్రత్యేక సూచన
- రాష్ట్రంలో వర్షపాతం, భూగర్భ జలాలపైనా సమావేశంలో చర్చ



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ సహా రాష్ట్రంలోని ప్రాధాన్యతా ప్రాజెక్టుల పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనుల వివరాలను జలవనరుల శాఖ అధికారులు ఆయనకు నివేదించారు. పోలవరం ప్రాజెక్టులో నిన్నటి వరకు 89.9 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎడమ కాలువ పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయని, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2 పనులను శరవేగంగా చేపట్టినట్టు తెలిపారు. ఇటీవల 14 లక్షల క్యూసెక్కుల భారీ

2లో..

## ఓటర్లకు ఎన్నికల సంఘం
# అలెర్ట్

**- రూ.5 చెల్లించాలంటూ మీకు మెసేజ్ వస్తే జాగ్రత్త**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) ఓటర్లను లక్ష్యంగా చేసుకుని సైబర్ మోసగాళ్లు కొత్త తరహా మోసానికి తెరతీశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ పేరుతో నకిలీ మెసేజ్‌లు పంపుతూ ప్రజల వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఓటరు వివరాలు సరిపోలడం లేదని ఎస్ఐఆర్ ఫారం తిరస్కరణకు గురైందని చెబుతూ వాటిని సరిచేసుకోవాలంటే లింక్‌పై క్లిక్ చేసి రూ.5 చెల్లించాలని కోరుతున్న మెసేజ్‌లు ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇలాంటి మెసేజ్‌లు పూర్తిగా నకిలీవి అని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం స్పష్టం చేసింది. ఎన్నికల సంఘం, తెలంగాణ సీఈఓ కార్యాలయం ఓటర్లకు ఎస్ఐఆర్ వివరాల సవరణ పేరుతో ఎలాంటి చెల్లింపు లింకులు పంపించదు అని తెలిపింది. కేవలం రూ.5 మాత్రమే కదా అని నిర్లక్ష్యంగా లింక్‌ను ఓపెన్ చేయవద్దని సూచించింది.

2లో..

# హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!

**- జనసైనికులకు మరోసారి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** సోషల్ మీడియా వేదికగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు అనుసరించాల్సిన వైఖరిపై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మరోసారి కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. పార్టీ నేతలు, జనసైనికులు, వీర మహిళలు పోస్టులు పెట్టేటప్పుడు, వివిధ అంశాలపై స్పందించేటప్పుడు భాష విషయంలో సంయమనం పాటించాలని, పరిధి దాటవద్దని ఆయన స్పష్టంగా దిశానిర్దేశం చేశారు. అనవసర విషయాలపై ఇష్టానుసారం మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం సరికాదని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తరుణంలో

2లో..

# పాక్ అనుభవించాల్సిందే

**- జాతినుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తీవ్రవాదులు తమ చర్యలకు తగిన ఫలితాలు అనుభవించాల్సిందేనని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మరోసారి తేల్చిచెప్పారు. పహల్గాం దాడుల తర్వాత సింధు జలాలకు బ్రేక్ వేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని ఆమె సమర్థించారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జాతినుద్దేశించి చేసే సంప్రదాయ ప్రసంగంలో ముర్ము పలు కీలక విషయాలు ప్రస్తావించారు. నక్సలిజం నిర్మూలన దిశగా భారత్ అడుగులు వేస్తోందని, అలాగే ప్రపంచమంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా భారత్ మాత్రం నిలకడగా వృద్ధి చెందుతోందని ఆమె కితాబిచ్చారు. అలాగే డబ్బుల్లేక ఎవరూ న్యాయానికి దూరం కాకూడదని ఆమె ఆకాంక్షించారు. ఉగ్రవాదంపై భారత్ కఠిన వైఖరిని అవలంబిస్తున్నట్లు రాష్ట్రపతి గుర్తుచేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశంతో (పాకిస్తాన్ )సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం జాతీయ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా రైతుల ప్రయోజనాల

2లో..

# రాజగోపాల్ రెడ్డి కామెంట్స్ రచ్చ!

**- పీసీసీ చీఫ్ సీరియస్ వార్నింగ్!**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో అధికార పార్టీ కాంగ్రెస్‌లో ఇప్పుడు స్వపక్షంలోనే విమర్శల పర్వం మొదలైంది. ఒకవైపు ప్రభుత్వం తన పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంటే, మరోవైపు సీనియర్ నేతల మధ్య మొదలైన మాటల యుద్ధం గాంధీ భవన్‌లో సెగలు పుట్టిస్తోంది. మనుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి ప్రతిగా తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చిన కౌంటర్లు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకంగా మారాయి.

### రాజగోపాల్ అసంతృప్తికి కారణమేంటి.?

చాలా కాలంగా వివిధ వేదికలపై కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన కామెంట్స్ కాంగ్రెస్‌లో కాక రేపుతున్నాయి. సమయం చిక్కినప్పుడల్లా తనకు మంత్రి కావాలనో, లేదా కాంగ్రెస్‌లో సీనియర్లకు గుర్తింపు లేదనో మాట్లాడుతూ వార్తల్లో ఉంటున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతున్నాయి. తాను ముమ్మాటికీ కాంగ్రెస్ సైనికుడినే అని, రాహుల్ గాంధీ నాయకత్వంలోనే పని చేస్తానని చెబుతూనే పార్టీలో జరుగుతున్న పరిణామాలపై ఆయన విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. పార్టీతో ఏ మాత్రం సంబంధం లేదని

2లో..

# 'ఇన్వెస్ట్ తెలంగాణ' థీమ్‌తో గ్లోబల్ సమ్మిట్

ప్రస్తుతం నగరంలో ఉన్న 18, 766 పెట్రోల్, డీజిల్ ఆటోరిక్షాలను ఈవీలుగా మారుస్తారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు ఒక్కో వాహనానికి గరిష్ఠంగా 1, 50, 000 సబ్సిడీ అందజేయనున్నారు. ఇది పాత ఆటోలకు ఈవీ కిట్లు అమర్చుకోడానికి లేదా పాతవి స్క్రాప్ చేసి కొత్త ఈ-ఆటోలు కొనడానికి వర్తిస్తుంది.

### సన్న వడ్లకు 500 రూపాయల బోనస్

రైతులకు ప్రోత్సహించే దిశగా కేబినెట్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. వానాకాలంలో పంట 7 రకాల సన్నధాన్యాలకు క్వింటాకు ఐదు వందల బోనస్ చెల్లించాలని నిర్ణయించారు. మిగులు ధాన్యం సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. కేంద్రం తీసుకోగా మిగిలిన 17. 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ వేలం ద్వారా విక్రయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీనికి కనీస ధర క్వింటాలుకు రూ.2,389గా నిర్ణయించారు. రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించడమే లక్ష్యంగా విద్యాసంస్థల నిర్వహణలో మార్పులు చేశారు. రాష్ట్రంలోని ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కాలేజీలను ఇకపై యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ పరిధిలోకి తీసుకురానున్నారు. ఆదిలాబాద్, గజ్వేల్, దుబ్బాక వంటి ఏడు నియోజకవర్గాల్లో కొత్తగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి ఆమోదం తెలిపారు. దీంతో మొత్తం స్కూల్స్ సంఖ్య 86కు చేరింది.

### ఇతర నిర్ణయాలు

మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు ఫేజ్ -2 పనుల కోసం రూ. 2100 కోట్ల అంచనా వ్యయానికి కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని ద్వారా లక్ష ఎకరాలు సాగునీరు అందనుంది. హైదరాబాద్‌లో కాలుష్య కారక పరిశ్రమల తరలింపునకు సంబంధించిన దరఖాస్తు గడువును అక్టోబర్ 31 వరకు పొడిగించారు. హెచ్ఎండీఏ పరిధిలో టీడీఆర్ సర్టిఫికేట్ల జారీ, వినియోగంపై ప్రభుత్వం కొత్త ఉత్తర్వులను జారీ చేసింది.

# ఇది నాకూ విద్యార్థులకూ మధ్య విషయం

జోక్యంతో పరిస్థితులు తలకిందులయ్యాయి. చాలామంది విద్యార్థులకు దీనితో సంబంధం లేదని, ప్రధాన న్యాయమూర్తిని అవమానించే ఉద్దేశం వారికి లేదని గ్రహించిన బీసీఐ.. సర్క్యులర్ జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఆ వివాదాస్పద నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించింది.

### నేనూ ఒకప్పుడు ఆందోళనల్లో పాల్గొన్నా: సీజేఐ స్పష్టత

బీసీఐ తీసుకున్న చొరవపై సుప్రీం కోర్టు సీజేఐ సూర్య కాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇది తీవ్రంగా ఖండించాల్సిన విషయం. విద్యార్థిగా ఉన్న రోజుల్లో నేను కూడా ఆందోళనలు, నిరసనల్లో చురుగ్గా పాల్గొన్నాను. ఇది నాకూ, విద్యార్థులకూ మధ్య ఉండే ఒక రకమైన భావ వ్యక్తీకరణ. ఇందులో జోక్యం చేసుకోవడానికి బీసీఐ ఎవరు?" అని సీజేఐ ఘాటుగా ప్రశ్నించారు. ఈ ఘటనకు సంబంధించి నాల్సార్ విద్యార్థులపై గానీ, అధ్యాపకులపై గానీ ఎలాంటి కఠినమైన లేదా క్రమశిక్షణా చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ జారీ చేసిన ఆదేశాలపై వివరణ ఇవ్వాలని బీసీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది.

### హక్కులను కాలరాయడమే: ఎస్సీబీఏ నిరసన

మరోవైపు సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ కూడా బీసీఐ చర్యను "అసమంజసమైనది, చట్టవిరుద్ధమైనది" అని అభివర్ణించారు. బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రాకు రాసిన లేఖలో రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛగా మాట్లాడే హక్కును ఉపయోగించుకున్నందుకు లా విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను అడ్డుకోవడం వారిని భయభ్రాంతులకు గురి చేయడమేనని విమర్శించారు. విశ్వవిద్యాలయాలు స్వేచ్ఛా ఆలోచనలకు, చర్చలకు నిలయాలని, ఒక రాజ్యాంగ వ్యవస్థతో విబేధించినంత మాత్రాన వారిని వృత్తిలోకి రాకుండా అడ్డుకోవడం తగదని తేల్చి చెప్పారు.

# యుద్ధప్రాతిపదికన పోలవరం పనులు

వరద ప్రవాహం వచ్చినప్పటికీ, పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా కొనసాగించామని నివేదికలో పేర్కొన్నారు.పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, పలు కీలక సూచనలు చేశారు. డ్యామ్ సైట్ వద్ద రోడ్ల వంటి మౌలిక వసతుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా, ప్రాజెక్టు సమీపంలోని గండి పోశమ్మ ఆలయాన్ని పరిరక్షిస్తూ, స్థానికుల మనోభావాలను గౌరవించేలా కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మొత్తం 36 ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడంపై చర్చించారు. రాష్ట్రంలోని రిజర్వాయర్లలో నీటి నిల్వలు, లోటు వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, తాగునీటి సరఫరా, జలధార-జలహారతి కార్యక్రమాల అమలు వంటి అనేక కీలక అంశాలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హిందూ కుటుంబాలను వేధిస్తూ..
# మైనారిటీలకు ఉచిత విద్యుత్ ఇస్తారా?

పాతబస్తీలోని మైనారిటీలు విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదని, అందుకే వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామనే రీతిలో సీఎం మాట్లాడటాన్ని రాంచందర్ రావు తప్పుబట్టారు. నిబంధనలు పాటించడం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందనే సాకుతో హైడ్రా ద్వారా పేద హిందూ కుటుంబాల ఇళ్లను కూల్చివేస్తున్నప్పుడు చూపించని సానుభూతిని, విద్యుత్ బిల్లులు చెల్లించని మైనారిటీల విషయంలో ఎందుకు చూపిస్తున్నారని నిలదీశారు. ఒకవైపు సామాన్య పేద హిందూ కుటుంబాలపై హైడ్రాను ప్రయోగిస్తూ వేధింపులకు గురిచేస్తూ మరోవైపు మైనారిటీల సంక్షేమం పేరుతో వారు బిల్లులు కట్టకపోవడాన్ని సమర్థిస్తూ ప్రోత్సహించేలా మాట్లాడటం కాంగ్రెస్ నైజానికి నిదర్శనమని మండిపడ్డారు. హిందువుల ప్రయోజనాలను పణంగా పెట్టి మైనారిటీలను ప్రసన్నం చేసుకునే బుజ్జగింపు రాజకీయం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదని, ఖిలాఫత్ ఉద్యమం నాటి నుంచి నేటి వరకు వారి విధానంలో ఎలాంటి మార్పు రాలేదని విమర్శించారు.

# రాజగోపాల్ రెడ్డి కామెంట్స్ రచ్చ!



వారు ప్రస్తుతం ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తున్నారని, ఏళ్ల తరబడి జెండా మోసిన అసలైన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు, పాత కాంగ్రెస్ శ్రేణులను అణచివేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ అభివృద్ధి నిధులు ఆంధ్ర కాంట్రాక్టర్లకే దక్కుతుందని, సీమాంధ్ర పాలకుల మీడియా చేతుల్లో ప్రభుత్వం ఉండకూడదని ఆయన సూటిగా విమర్శించారు. పేదల ఇందిరమ్మ ఇళ్లకు వందల కొద్దీ కొర్రీలు పెడుతున్నారని, అదే సమయంలో బడా ప్రాజెక్టుల పేరుతో దోపిడీ జరుగుతోందని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు.

### ఎందుకు ఈ వివాదం.?

చాలా కాలంగా మంత్రి పదవి కోసం చాలా కాలంగా రాజగోపాల్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే మంత్రివర్గ విస్తరణ జరగనుంది. అందుకే తన వాక్ స్పీడ్ పెంచారని పార్టీలో గట్టిగా వినిపిస్తుంది. ఈసారి మంత్రివర్గంలో తన పేరు కచ్చితంగా ఉండాలనే వ్యూహాత్మక ఒత్తిడి పెంచుతున్నారని విశ్లేషకులు భావిస్తున్నారు. అదే టైంలో తన జిల్లా రాజకీయాల్లో తగ్గుతున్న ప్రాధాన్యతను ఆయన ప్రశ్నిస్తున్నారు.

### తెలంగాణ పీసీసీ చీఫ్ సీరియస్ వార్నింగ్!

రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలను తెలంగాణ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సీరియస్ అయ్యారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎవరినైనా సహించేది లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి నుంచి సామాన్య కార్యకర్త వరకు అందరికీ ఒకే రూల్ బుక్ వర్తిస్తుందని, ఎవరూ పార్టీ కంటే పెద్దవారు కాదని ఆయన స్పష్టం చేశారు.ఎక్కడా నేరుగా రాజగోపాల్ రెడ్డి పేరు ప్రస్తావించలేదు. ఆయన చెప్పిన అభిప్రాయం సరైందేనని కానీ, హద్దులు దాటి మాట్లాడటం సరికాదని అన్నారు. మంత్రిపదవులు, లేదా ఇతర పదవులపై తుది నిర్ణయం హైకమాండ్‌దేనని, అందరి కోరికలను ఒకేసారి తీర్చడం ఎవరికీ సాధ్యం కాదని తేల్చి చెప్పారు. ఈ వ్యవహారాన్ని పార్టీ క్రమశిక్షణ కమిటీకి లేదా హైకమాండ్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన సంకేతాలు ఇచ్చారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పాత కాంగ్రెస్, కొత్తగా వచ్చిన వారు మధ్య ఒక కోల్డ్‌వార్ నడుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన వారికి సరైన గుర్తింపు దక్కం లేదనే భావన కొంతమంది సీనియర్లలో ఉంది. ఈ క్రమంలోనే రాజగోపాల్ రెడ్డి తన వ్యాఖ్యల ద్వారా తెలంగాణ ఆత్మగౌరవ కార్డును బయటకు తీశారని మరికొందరు ఆరోపిస్తున్నారు.

# విద్యావ్యవస్థను సమూల ప్రక్షాళన చేశాం

ముందుగానే వారి ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. క్లెస్ రోడ్ హెచ్ఎండీఏ గ్రౌండ్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలే విగ్రహాలను సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం రోజున ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జ్యోతీరావు పూలే, సావిత్రీబాయి పూలేలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ మైదానంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అడక్కుండానే వారి ఖాతాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు వేస్తామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ఈ విద్యా సంవత్సరం నుంచి ముందస్తుగా ప్రతి ఏటా రూ. 2,400 కోట్లు విద్యార్థుల ఖాతాల్లో వేసి ఈ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని అన్నారు. ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థుల సర్టిఫికెట్లను యాజమాన్యాలు నిలిపివేయకూడదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.అదే సమయంలో మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. ఒకప్పుడు ఇంజనీరింగ్, డాక్టర్ డిగ్రీ సర్టిఫికెట్ ఉంటే ఉద్యోగాలు వచ్చేవని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని గుర్తుచేశారు. స్కిల్స్ ఉంటే ఉద్యోగాలు వస్తాయని అందుకే నర్సరీ నుండి 12వ తరగతి వరకు విద్య, ఆ తర్వాత స్కిల్స్ నేర్పాల్సిన అవసరం ఉందని చెప్పారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికి ఈ సమాజం రెడ్ కార్పెట్ పరుస్తుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం సంపూర్ణమైన అవగాహనతో ముందుకు వెళ్తుందని చెప్పారు. ఏటీసీలు, పాలిటెక్నిక్, స్కిల్స్ యూనివర్సిటీ తదితర మార్గాల్లో సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. నర్సింగ్ వంటి నైపుణ్యాలకు జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో భారీ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.90 శాతం మార్కులు సాధించేవారే కాదు, సాంకేతిక నైపుణ్యంలో రాణించే వారూ, క్రీడల్లో రాణించే వారూ ఉంటారని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా క్రీడల్లో రాణించిన వారికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు కోటి రూపాయల నగదు బహుమతిని అందిస్తామని ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి, ప్రముఖ క్రీడాకారులు నిఖత్ జరీన్, సిరాజ్, దీప్తి దివాంజీల పేర్లను ఉదహరించారు. "మీరూ క్రీడల్లో రాణించండి. రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించండి. దేశ స్థాయిలో గౌరవాన్ని తీసుకురాండి. ఒలింపిక్స్‌లో మెడల్స్ సాధించండి. ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చి, నగదు నజరానాలు ఇచ్చే బాధ్యత నాది. కేవలం చదువుకుంటేనే బతుకులు మారుతాయి. చదువుకుంటేనే మన తలరాతలు మారుతాయి. సాంకేతిక నైపుణ్యం ఉంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. అవకాశాలను అందిపుచ్చుకోవాలి. అవకాశాల కోసం పోటీ పడాలి" అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పుడు సాంకేతిక విప్లవం వచ్చిందని ఏఐ వల్ల ఇంజనీరింగ్, గ్రాడ్యుయేషన్, ఐటీ నిపుణుల ఉద్యోగాలు కూడా పోయే ప్రమాదం తలెత్తిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ విధంగా ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవాలో మనం ఆలోచన చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కులాల మధ్య అంతరాలను తగ్గించడానికి అన్ని వర్గాలు ఒకే చోట కలిసిమెలిసి జీవించడమనే లక్ష్యంతో రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ విధానం ద్వారా విప్లవాత్మకమైన మార్పులు చేస్తున్నామని తెలిపారు.

# పాక్ అనుభవించాల్సిందే

కోసం తీసుకున్న నిర్ణయాత్మక చర్యగా ముర్ము అభివర్ణించారు. ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇచ్చేవారు ఎక్కడ దాక్కున్నా పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని రాష్ట్రపతి హెచ్చరించారు. ఉగ్రవాదంపై భారత్ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఆపరేషన్ సిందూర్ భారత సాయుధ దళాల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని, ఉగ్రవాద నెట్‌వర్క్‌లపై కచ్చితమైన దాడులు నిర్వహించే సామర్థ్యం భారత సైన్యానికి ఉందని ఈ ఆపరేషన్ నిరూపించిందని ఆమె తెలిపారు.భారత్‌ను నక్సలిజం రహిత దేశంగా మార్చే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్రపతి ప్రశంసించారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాద ప్రభావంతో ఇబ్బందులు ఎదుర్కొన్న బస్తర్ ప్రాంతంలో అభివృద్ధి వేగం పుంజుకోవడంతో పాటు సాంస్కృతిక కార్యకలాపాలు కూడా పెరుగుతున్నాయన్నారు. మరోవైపు ప్రపంచం యుద్ధాలు, అస్థిరత, అనిశ్చితితో సతమతం అవుతుంటే. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం ప్రపంచ సగటు వృద్ధి రేటు కంటే రెండింతలకు పైగా వృద్ధి సాధిస్తోందన్నారు. గత దశాబ్దంలో 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. అలాగే ఉచిత రేషన్ పథకం ద్వారా 80 కోట్లకు పైగా ప్రజలకు ఆహార భద్రత లభిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు ఆర్థిక వనరులు లేకపోవడం వల్ల ఏ ఒక్కరూ న్యాయానికి దూరం కాకుండా చూడటం న్యాయవ్యవస్థతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.

# హద్దులు దాటొద్దు, భాష జాగ్రత్త!



పార్టీ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో మాట్లాడే సమయంలో పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

### జనసేన శ్రేణులు పాటించాల్సిన 9 మార్గదర్శకాలు:

1. వ్యక్తిగత విషయాలు, వ్యక్తిగత దూషణల జోలికి వెళ్లవద్దు.
2. పార్టీల సిద్ధాంతాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా స్పందించాలి.
3. ఏదైనా విషయం మీద మాట్లాడే సమయంలో ఆవేశాలకు లోను కావద్దు. అసభ్య పదజాలాన్ని వాడవద్దు.
4. మహిళలను గౌరవించి మాట్లాడాలి.
5. పార్టీ అంతర్గత అంశాల పట్ల సోషల్ మీడియా వేదికగా ఇష్టానుసారం మాట్లాడరాదు. పార్టీ భావజాలాన్ని కించపరిచేలా మాట్లాడే వారిని పార్టీ ఉపేక్షించదు.
6. పార్టీ క్రమశిక్షణకి విఘాతం కలిగించేలా, జనసైనికుల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసే వారి పట్ల జాగ్రత్తగా ఉండండి. వారి ప్రభావానికి లోను కావొద్దు.
7. కూటమి ప్రభుత్వ స్ఫూర్తిని నిలబెట్టేలా మాట్లాడాలి.
8. రాజకీయ శత్రువుల సోషల్ మీడియా ప్రచార వలలో పడొద్దు. పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి.
9. పార్టీ అభ్యున్నతి, పార్టీ కోసం కష్టించి పనిచేసే జన సైనికులు, వీర మహిళల సంక్షేమం ఎల్లప్పుడూ అధ్యక్షుల వారి దృష్టిలో ఉంటుంది. సోషల్ మీడియాలో రకరకాల విష ప్రచారాలను తిప్పి కొట్టండి.

రాజకీయ ప్రత్యర్థులు సోషల్ మీడియా ద్వారా పార్టీలో అంతర్గత విభేదాలు సృష్టించేందుకు చేసే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వారి కుట్రలను తిప్పికొట్టాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పార్టీ క్రమశిక్షణే అత్యంత కీలకమని, దానికి విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని ఈ ప్రకటన ద్వారా పార్టీ అధిష్ఠానం గట్టి హెచ్చరికలు పంపింది. ఇటీవల ఒంగోలులో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, జనసేన నేత బాలినేని శ్రీనివాసరెడ్డిల మధ్య తీవ్ర స్థాయిలో మాటల యుద్ధం నడిచిన నేపథ్యంలో, పవన్ కల్యాణ్ తాజా మార్గదర్శకాలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఓటర్లకు ఎన్నికల సంఘం అలెర్ట్

లింక్ ద్వారా బ్యాంకు అకౌంట్ వివరాలు, కార్డు నంబర్, పిన్, పాస్‌వర్డ్, సీవీవీ, ఓటీపీ వంటి సున్నితమైన సమాచారాన్ని సేకరించే అవకాశం ఉందని హెచ్చరించింది.సైబర్ నేరగాళ్లు వాట్సాప్, ఇతర సోషల్ మీడియా వేదికలను ఉపయోగించి ఎన్నికల అధికారుల పేరుతో ఈ మెసేజ్‌లను పంపిస్తున్నట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో తెలిపింది. ఓటరు వివరాలను అప్‌డేట్ చేయడం, ధ్రువీకరించడం, ఎస్ఐఆర్ ఫారం సవరణ కోసం చెల్లింపు అవసరమంటూ నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొంది. ఎస్ఐఆర్ లేదా ఓటరు వివరాల సవరణ ప్రక్రియ పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే స్పందించవద్దని సూచించింది. అనుమానాస్పద మెసేజ్‌లు, కాల్స్ వస్తే వాటికి సమాధానం ఇవ్వకుండా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎన్నికల అధికారులు కోరారు. పొరపాటున లింక్‌ను క్లిక్ చేసి బ్యాంకింగ్ వివరాలు వెల్లడించినా, నగదు నష్టపోయినా వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే ఆన్లైన్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. సైబర్ మోసం జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే నష్టపోయిన మొత్తాన్ని నిలిపివేసే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీతో
# కంచికచర్లలో దేశభక్తి వెల్లువ..

**- విద్యార్థులు, కూటమి శ్రేణులతో కలిసి భారీ ర్యాలీకి నేతృత్వం వహించిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**కంచికచర్ల:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా భారీ ర్యాలీతో కంచికచర్ల పట్టణం దేశభక్తి నినాదాలతో మారుమోగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సారథ్యంలో విద్యార్థులు, మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షులు కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు.కంచికచర్ల పట్టణ మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి బంక్ సెంటర్ వరకు సాగిన ఈ భారీ ర్యాలీలో తంగిరాల సౌమ్య గారు స్వయంగా పాల్గొని విద్యార్థులు, కూటమి శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు. ర్యాలీ ఆద్యంతం "వందేమాతరం", "భారత్ మాతాకీ జై", "స్వతంత్ర భారత్ మాతాకీ జై" వంటి దేశభక్తి నినాదాలతో కంచికచర్ల పట్టణం హోరెత్తింది.అనంతరం బంక్ సెంటర్‌లో నిర్వహించిన మానవహారంలో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని జాతీయ సమైక్యత, దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే స్ఫూర్తిని ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.దేశభక్తి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో భాగంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని, జాతీయ జెండా ప్రతి భారతీయుడి గుండెల్లో గర్వానికి ప్రతీకగా నిలవాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. కంచికచర్లలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ దేశభక్తి, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

# జనగామ భరోసా కేంద్రాన్ని సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత,



**వరంగల్** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, శుక్రవారం జనగామలోని భరోసా కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి, కేంద్రంలో అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా భరోసా కేంద్రంలో బాధితులకు అందిస్తున్న కౌన్సెలింగ్, న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక పరామర్శ, పునరావాస చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడిని సానుభూతితో, గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.మహిళలు, చిన్నారులు, ఇతర బాధితులకు ఒకే వేదికపై అన్ని సేవలు అందించే భరోసా కేంద్రం ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి కేసును నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. బాధితుల గోప్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, వారికి అవసరమైన అన్ని రకాల సహాయ సహ కారాలు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్శనలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, భరోసా కేంద్రం ఇన్స్పెక్టర్ సువర్ణ, ఏసీపీలు భీం శర్మ, నర్సయ్య, ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భరోసా కేంద్రం కోఆర్డినేటర్ సుధా, లీగల్ అడ్వైజర్ దయామణి,సపోర్ట్ పర్సన్స్‌స్వాతి, అపర్ణతో పాటు ఇతర సిబ్బంది సునీత, హరిత పాల్గొన్నారు

# ప్రమాదవశాత్తూ నలుగురు కార్మికులు మృతి

**న్యూఢిల్లీ** ఉత్తరాఖండ్లోని పీపాల్కోటి హైడ్రో ప్రాజెక్ట్లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు కార్మికులు మృతి చెందారు. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో శిధిలాలు టెయిల్రేస్ టన్నెల్లోకి చేరుకున్నాయి. ఆ నీటిలో దాదాపు 22 మంది కార్మికులు చిక్కుకుపోయారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి 18 మందిని సురక్షితంగా బయటకు తీసాయి బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. వారినిలో ముగ్గురు, నలుగురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఇప్పటివరకు నాలుగు మృతదేహాలు వెలికితీసారు. మిగతా వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

# బద్వేల్ మున్సిపాలిటీలో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం



**బద్వేలు** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా బద్వేల్ మున్సిపాలిటీలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆగస్టు 14న విస్తృత స్థాయిలో మొక్కలు నాటి, వాటి సంరక్షణకు ప్రతిజ్ఞ చేయాలని కార్యక్రమ మార్గదర్శకాల్లో సూచించారు.బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని మైదుకూరు రోడ్డులోనిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఏ. చంద్రమోహన్ తాసిల్దార్ తిరుమల బాబు టీడీపీ బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొని మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఆర్డీవో ఏ. చంద్రమోహన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. స్వచ్ఛమైన, పచ్చదనంతో కూడిన వాతావరణం కోసం ప్రజలు పెద్ద ఎత్తున మొక్కలు నాటి, వాటి సంరక్షణకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

# రెండు హత్యలు చేసి యాధావిధిగా విధులకు హాజరు

**- నిందితులను పట్టించిన సీసీ ఫూటేజీ**

**సూర్యాపేట** సూర్యాపేట జిల్లా భార్యాభర్తల హత్యకేసులలో కానిస్టేబుల్ పాత్ర పలు మలుపులు తీరిగింది. కానిస్టేబుల్ షరీఫ్ హత్య చేసిన తర్వాత మోతె నుంచి సూర్యాపేట వెళ్లిపోయాడు. బుధవారం యథావిధిగా విధులకు హాజరైయాడు. ఘటనా స్థలంలో మృతదేహాలను వెలికితీసే సమయంలో అక్కడే విధుల్లో పాల్గొన్నాడు. తనకేం తెలియదన్నట్లు అమాయకంగా ప్రవర్తించాడు. స్థానికులు ఘటనా స్థలంలోకి వస్తున్న సమయంలో ఆధారాలు చెదిరిపోతాయంటూ అరిచాడు. అయితే, సీసీ ఫూటేజీ ఇద్దరి హత్య కేసులో నిందితులను పట్టించింది. గుంతను పూడ్చేందుకు పార తీసుకెళ్తున్న సుందరయ్యల విజువల్స్ సీసీ కెమెరాలో రికార్డ్ అయింది. పోలీసులు సుందరయ్యను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. షరీఫ్ గతంలోనే ఓసారి బూబా హత్యకు ప్లాన్ వేసాడు. షరీఫ్ చంపిన బూబా వయస్సు 42 సంవత్సరాలు. ఇద్దరిని హత్య చేసిన కానిస్టేబుల్ షరీఫ్ వయస్సు 26 సంవత్సరాలు.

# వరుస చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించిన భద్రాద్రి జిల్లా పోలీసులు

**- 8 మంది నిందితుల అరెస్ట్.. ఒకరు అంతర్రాష్ట్ర నేరస్తుడు.. - రూ.26 లక్షల విలువైన సొత్తు స్వాధీనం**



**కొత్తగూడెం** కొత్తగూడెం జిల్లాలో వరుసగా జరుగుతున్న చైన్ స్నాచింగ్ కేసులను పోలీసులు సమర్ధవంతంగా ఛేదించారు. అశ్వారావుపేట, దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన వరుస చోరీ కేసులపై ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ కేసులకు సంబంధించి మొత్తం 8 మంది నిందితులను అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి సుమారు 150 గ్రాముల బరువున్న 6 బంగారు గొలుసులను, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు మొత్తం విలువ సుమారు రూ. 26 లక్షలు ఉంటుందని తెలిపారు. ప్రధాన నిందితుడు సున్నం నాగేంద్రబాబు ఏ నాగేంద్ర తన సహచరులతో కలిసి రాత్రి వేళల్లో ఇళ్ల బయట నిద్రిస్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడని దర్యాప్తులో వెల్లడైంది. మహిళల మెడలోని బంగారు గొలుసులను ఎలక్ట్రిక్ వైర్ కట్టర్‌తో కట్ చేసి క్షణాల్లో అపహరించి, ద్విచక్ర వాహనాలపై అక్కడి నుంచి పరారయ్యేవారు. కొన్ని సందర్భాల్లో ముందుగానే ద్విచక్ర వాహనాలను చోరీ చేసి, వాటిని తదుపరి నేరాలకు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితులు తమ వద్ద ఉంచుకోకుండా, ముఠాకు సహకరిస్తున్న మహిళల వద్ద దాచిపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుల విచారణలో దమ్మపేట, బూర్గంపాడు, పాల్వంచ రూరల్, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మొత్తం 10 కేసులకు సంబంధించి కీలక ఆధారాలు లభించాయి. ఈ ముఠాలో ప్రధాన నిందితుడైన సున్నం నాగేంద్రబాబు, వయస్సు 35 సంవత్సరాలు, ఉసిర్లగూడెం గ్రామం, అశ్వారావుపేట మండలానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఇతనిపై అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, బూర్గంపాడు, పాల్వంచ, భద్రాచలం, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 83 దొంగతనం కేసులు ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇతనితో పాటు వల్లూరి శాంతరాజు ఏ రాజు, ఉకే భద్రం ఏ వీరభద్రం, బెత్తి కార్తిక్, ఊర లింగయ్య, బెత్తి ఆదిలక్ష్మి, కల్లూరి లావణ్య, అల్లం సారమ్మ ఏ సర్లమ్మలను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో వల్లూరి శాంతరాజుపై 11 దొంగతనం కేసులు, ఊర లింగయ్యపై 12 దొంగతనం కేసులు ఉన్నట్లు తెలిపారు. ఈ కేసుల్లో మరో నిందితుడైన తమ్మిశెట్టి బాలవీరస్వామి, వయస్సు 50 సంవత్సరాలు, మాధాల గ్రామం, ముప్పాళ్ల మండలం, పల్నాడు జిల్లా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. ఇతను అంతర్రాష్ట్ర నేరస్తుడిగా గుర్తించామని, అతని కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్పి తెలిపారు. దర్యాప్తులో భాగంగా పార్కలగండి, దమ్మపేట పరిధిలో వృద్ధ మహిళను లక్ష్యంగా చేసుకుని బంగారు నానుతాడు చోరీ చేసినట్లు, బూర్గంపాడు పరిధిలో ద్విచక్ర వాహనం చోరీ చేసినట్లు, పాల్వంచ రూరల్ పరిధిలో మరో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం చోరీ చేసిన వాహనాలను ఉపయోగించి బూర్గంపాడు, టేకులపల్లి, కొమరారం, జూలూరుపాడు, చంద్రుగొండ ప్రాంతాల్లో మహిళల మెడలోని బంగారు గొలుసులను చోరీ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. చంద్రుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీతాయిగూడెం కేసులో ప్రధాన నిందితుడి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు చైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా ఇతర కేసుల్లో చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుల సహకారంతో వివిధ ప్రాంతాల్లో దాచిపెట్టినట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వరుస చైన్ స్నాచింగ్ కేసులను సమర్ధవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంతో పాటు భారీ మొత్తంలో చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అభినందించారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ప్రజల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఎస్పీ తెలిపారు. ఈ కేసుల ఛేదనలో పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, అశ్వారావుపేట సీఐ నాగరాజు, ఎస్ఐలు రాజేశ్ కుమార్, యయాతి రాజు, బాలస్వామినాధం, దేవ్ సింగ్, హెచ్‌సీ ప్రసాద్, పీసీలు వెంకట్, ధర్మారావు, లక్ష్మయ్య, రామకృష్ణారెడ్డి, బాలకృష్ణ, నరసింహారావు, డబ్ల్యూపీసీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# విషాదంగా మారిన తీర్థయాత్ర

**నిజామాబాద్** తీర్థయాత్ర విషాదంగా మారిన ఘటన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ప్రాంతంలో చోటుచేసుకుంది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ నుంచి హైదరాబాద్‌లోని చిన్నజీయర్ స్వామి తీర్థయాత్రకు రెండు బస్సుల్లో భక్తులు బయలుదేరారు. ఆర్మూర్ మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న బస్సు టైర్ పంచర్ కావడంతో రెండు బస్సులు హైవేపై నిలిచిపోయాయి. వెనుక బస్సులోని కొంతమంది ప్రయాణికులు బస్సు దిగడంతో పాటు డివైడర్‌పై కూర్చుని సేదతీరుతున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ, ఆగి ఉన్న బస్సును గమనించక అతివేగంగా ఢీకొట్టింది. లారీ ఢీకొట్టడంతో బస్సు ముందుకు కదిలి డివైడర్‌పై కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు సుజాత, మాధవి అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంతో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# కొండపల్లి దర్గాలో తిరంగా కార్యక్రమం

**ఎన్టీఆర్** కొండపల్లి లోని సయ్యద్ షా బుకారీ దర్గా ఆవరణలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు ఫారూఖ్ షుబ్లీ ప్రారంభించారు. దేశం కోసం, ధర్మం కోసం అనే ముఖ్య లక్ష్యం తో నియోజకవర్గం లో 5వేల ఇళ్ళకు, రాష్ట్ర వ్యాప్తంగా 65 నియోజకవర్గాల్లో లక్ష ఇళ్ళకు జాతీయ జెండాల పంపిణీ కి శ్రీకారం చుట్టారు. పూర్వీకుల పిలుపు మేరకు వేలాది ముస్లిం లు స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలర్పించారు, నేటి తరం కూడా దేశ రక్షణకు కట్టుబడి ఉందని షుబ్లీ అన్నారు. దేశానికి ఏ చిన్న ఆపద వచ్చినా పోరాటానికి ముందువరుసలో నిలుస్తామని స్పష్టం చేసారు. 450సంవత్సరాల చరిత్ర కలిగిన షా బుకారీ దర్గా ఆవరణలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమ నిర్వహణ అభినందనీయమని సూఫీ మత గురువు అల్తాఫ్ రాజా అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ బాద్యతగా తమ ఇళ్ళపై జాతీయ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. దర్గా ఆవరణలో జాతీయ జెండాలను పంచుతూ దేశ భక్తిని చాటిచెప్పారు.

## కిరిడి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం

**- చెడిపోయిన చేతి పంపును వెంటనే బాగు చేయించిన పంచాయతీ ప్రజాప్రతినిధులు**



**ఆసిఫాబాద్,** వాంకిడి మండలం కిరిడి గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో చేతి పంపు చెడిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. విషయం తెలుసుకున్న వెంటనే గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ కోట్రంగె సాగర్, సర్పంచ్ అమృత అంబరావు తక్షణమే స్పందించారు. పంపు మెకానిక్ జాడి గౌరయ్యను పిలిపించి చెడిపోయిన చేతి పంపును వెంటనే బాగు చేయించారు. దీంతో కాలనీలోని ప్రజలకు తాగునీటి సమస్య తీరింది. సమస్యను వెంటనే పరిష్కరించిన ప్రజాప్రతినిధుల పని తీరుపై ఎస్టీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పట్టించుకున్న సర్పంచ్, ఉప సర్పంచ్ లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# దేశభక్తి నినాదాలతో మార్మోగిన తాండూరు..

**- తిరంగా యాత్ర లో భారీగా పాల్గొన్న విద్యార్థులు**



**తాండూరు** దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటుతూ తాండూరు మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో 500 మీటర్ల భారీ జాతీయ జెండాతో తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. బీజేపీ నాయకులు, జాతీయవాదులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో తాండూరు ప్రధాన రహదారులు జాతీయ జెండాలతో కళకళలాడాయి. స్థానిక యూనియన్ బ్యాంక్ అండర్ బ్రిడ్జి నుంచి ప్రారంభమైన తిరంగా యాత్ర ఐబీ ప్రధాన కూడలి అండర్ బ్రిడ్జి మీదుగా కొనసాగింది. పాల్గొన్న వారు చేతుల్లో జాతీయ జెండాలు పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. భారీ జాతీయ జెండాను ప్రదర్శిస్తూ నిర్వహించిన ఈ యాత్ర స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా యాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. ప్రతి భారతీయుడు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని చాటాలని వారు పిలుపునిచ్చారు. తిరంగా యాత్రలో విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్థానిక విద్యాభారతి, సెయింట్ థెరిస్సా పాఠశాలలకు చెందిన 300 మందికి పైగా విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని యాత్రలో పాల్గొన్నారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో యాత్ర మార్గం మార్మోగింది. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, సైనికుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని నాయకులు అన్నారు. జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, కోట్లాది భారతీయుల గౌరవం, త్యాగం, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు దూడపాక భరత్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యాల ఏమాజీ, జిల్లా కార్యదర్శులు రామగౌని మహీధర్ గౌడ్, రాచర్ల సంతోష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు పులగం తిరుపతి, బొల్లెడ్ల కేశవరెడ్డి, యంగర్ తుకారాం, జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకులు పాగిడి చిరంజీవి, నర్సింగ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏముర్ల ప్రదీప్‌తో పాటు మండల నాయకులు, జాతీయవాదులు అభినవ సంతోష్ కుమార్, గాదె రాజేశం, చోక్కాల నాగభూషణ్, ఏముర్ల ప్రవీణ్, గుజ్జేటి శేఖర్, ప్రభాకర్, అడ్వాల సతీష్, ఎలిగేటి నరేష్, ఆనంద్, కామెర మహేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

**- దేశభక్తి ప్రతి ఇంటి నుంచి కనిపించాలి**

**- నెల్లిమెట్లలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తాము సూరిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం**



**రాజవొమ్మంగి** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 14న నెల్లిమెట్ల గ్రామంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తాము సూరిబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిపైనా జాతీయ జెండా ఎగరాలని, దేశభక్తి ప్రతి ఇంటి నుంచి కనిపించాలని తాము సూరిబాబు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చోడినిప్పారి, బొరగా రామకృష్ణ, ఈశ శీను, మిరియాల బాబురావు పాల్గొన్నారు.

# న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ తొర్రూరు బార్ అసోసియేషన్ విధుల బహిష్కరణ

న్యాయవాదిపై జరిగిన దాడిని నిరసిస్తూ తొర్రూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. న్యాయవాదిపై దాడి చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని బార్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తొర్రూరు బార్ అసోసియేషన్‌కు చెందిన పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## రాస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం...



**రేణిగుంట** శ్రావణమాసం పురస్కరించుకొని రాస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కొర్లగుంట లోని ప్రసన్న భారతి పాఠశాల నందు రాస్ మహిళా సంఘాల అధ్వర్యంలో ఘనంగా సామూహిక వరలక్ష్మి పూజను అత్యంత వైభవంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఎస్.వెంకటరత్నం గారు పాల్గొని మహిళలకు క్రమశిక్షణతో పాటు ఆధ్యాత్మిక భావన ఎంతో అవసరమని, మహిళలు ఎంతో పవిత్రంగా భావించే శ్రావణమాసంలో ఇంతమంది మహిళలతో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించకోవడం ఆనందదాయకమని తెలిపారు. మహిళలు ఇంటి వద్ద సమయము వృధా చేయకుండా కష్టపడి పనిచేయడం వల్ల లక్ష్మీదేవి తనంతట తానే మన ఇండ్లకు వస్తుందని తెలిపారు. వృధా ఖర్చులు తగ్గించి పొదుపు చేయు అలవాటును పెంపొందించు కోవడంవల్ల కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. పూజ అనంతరం లబ్ధిదారులకు బెడ్ షీట్లు, చేతి కర్రలు, మూడు చక్రాల సైకిల్, వీల్ చైర్, వినికిడి యంత్రాలు పంపిణీ చేయడం జరిగినది. దాదాపు 300 వందల మంది మహిళలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో రాస్ సంయుక్త కార్యదర్శి .యం.మమత పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్.వీ.నాగరాజు పాఠశాల ప్రిన్సిపాల్ ఈశ్వరి మరియు రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటడం మాత్రమే కాదు సంరక్షించడం మన బాధ్యత



**చిట్వేలి** పర్యావరణ పరిరక్షణ కొరకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని రైల్వే కోడూరు గ్రామీణ పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ డి. శ్రీనివాసులు అన్నారు. చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చిట్వేలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తో కలిసి పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అనేది ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని తెలిపారు. ఒక మొక్క నాటడం ద్వారా మన చుట్టూ పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. మొక్క నాటిన తర్వాత దాని సంరక్షణకు కూడా బాధ్యత తీసుకోవాలని, విద్యార్థులు తమ ఇళ్లలో, పాఠశాలల్లో పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించేలా కుటుంబ సభ్యులు, స్నేహితులు, సమాజంలోని ఇతరులను ప్రోత్సహించాలని సూచించారు. ఒక్కొక్కరు ఒక్క మొక్క నాటితే ఊరంతా పచ్చగా మారుతుందన్నారు. మొక్కను నాటుదాం, మొక్కను కాపాడుదాం, పర్యావరణాన్ని పరిరక్షిద్దాం, భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందిద్దాం అని పిలుపునిచ్చారు. ప్రతి విద్యార్థి నా మొక్క నా బాధ్యత అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని, పచ్చదనం పెంపొందించడంలో చురుకైన భాగస్వాములుగా నిలవాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. ఏఎస్ఐ వెంగయ్య, హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, కానిస్టేబుల్ నరేంద్ర, సుధాకర్ నాయుడు, పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు.

# కేంద్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదు




**చిట్వేలి** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలు ఏ ఒక్కటి నెరవేర్చలేదని సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గం కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ఆరోపించారు. సిపిఐ చిట్వేలి మండల పార్టీ నాయకులు తిప్పన ప్రసాద్ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి తహసిల్దార్ నరసింహారావు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పడి 12 సంవత్సరాలు అయినా ఎన్నికల్లో చేసిన ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. అధికారంలోకి రాకముందు నోటికొచ్చిన హామీ లిచ్చి?గద్దెనెక్కిన తర్వాత ప్రజల నడ్డివిరుస్తున్నారని విమర్శించారు. దేశ రాజకీయాల్లో మార్పు రావాలి, ప్రజాస్వామిక విధానాలు అమలు చేయడంలో మార్పు రావాలన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం మార్పు రావాలి, మతోన్మాదాన్ని వ్యతిరేకించడంలో మార్పు రావాలన్నారు. రాజ్యాంగ హక్కులు పరిరక్షించడంలో మార్పు రావాలి, ఎన్నికల విధానంలో మార్పు రావాలన్నారు. ధరల పెరుగుదలను అరికట్టడంలో మార్పు రావాలి, ఆర్థిక విధానాల అమలులో మార్పు రావాలన్నారు. కష్టించి పని చేసే శ్రమ జీవుల జీవితాల్లో మార్పు రావాలని, ఇవన్నీ జరగాలంటే 12 ఏళ్లుగా గద్దెపై కూర్చుని నియంతృత్వ విధానాలు అమలు చేస్తున్న బీజేపీని అధికారం నుంచి దించేయాలి అన్నారు. కులాలు, మతాలు, జాతుల మధ్య తగువులు పెట్టి దేశాన్ని భ్రష్టుపట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, బ్లాక్ మార్కెటింగ్ వ్యవస్థ విజృంభించి ప్రజలను దోచుకుంటోందని మండిపడ్డారు. సెప్టెంబర్ 1న దిల్లీలో జరిగే 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ చిట్వేలి మండల నాయకులు సామా గంగయ్య, మాలేమార్పురం కార్యదర్శి శ్రీనివాసులు. డిహెచ్‌పిఎస్ మండల కార్యదర్శి రవి, రైతు సంఘం నాయకులు పుల్లయ్య, వెంకటరమణ, నాగరత్నమ్మ, సుబ్బమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు

# అగ్నిమాపక శాఖకు అధునాతన వాహనాలు

## - రూ.40 కోట్లతో 58 ఫైర్ ఫైటింగ్ వాహనాలు ప్రారంభం



**అమరావతి(ప్రశ్న న్యూస్)** అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక శాఖను మరింత ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో కొనుగోలు చేసిన సుమారు రూ. 40 కోట్ల విలువైన 58 అధునాతన అగ్నిమాపక వాహనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో వాహనాలకు జెండా ఊపారు..

అగ్నిమాపక శాఖ అధికారులు కొత్త వాహనాల ప్రత్యేకతలను ముఖ్యమంత్రికి వివరించారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేలా రూ. 18.68 కోట్ల విలువైన 25 అధునాతన ఫైర్ ఫైటింగ్ వాహనాలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.

### 14 వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ బౌజర్లు

పెద్ద అగ్నిప్రమాదాల సమయంలో నిరంతర నీటి సరఫరా కోసం రూ. 14.79 కోట్ల విలువైన 20 వాటర్ బౌజర్లను సిద్ధం చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఒక్కో బౌజర్ 14 వేల లీటర్ల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటుందని తెలిపారు. పట్టణ, పారిశ్రామిక ప్రాంతాల్లో మంటలను అదుపు చేయడంలో ఇవి కీలకంగా ఉపయోగపడతాయని వివరించారు.

### ఇరుకైన ప్రాంతాల్లోనూ వేగంగా స్పందన

రద్దీ, ఇరుకైన ప్రాంతాల్లోనూ వేగంగా చేరుకుని సహాయక చర్యలు చేపట్టేలా రూ. 6.37 కోట్ల విలువైన 13 క్విక్ రెస్పాన్స్ మల్టీపర్పస్ ఫైర్ ఫైటింగ్ వాహనాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించినట్లు అధికారులు తెలిపారు.



### రూ.252.86 కోట్లతో ఆధునీకరణ

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో మొత్తం రూ. 252.86 కోట్ల వ్యయంతో దశలవారీగా ఆధునిక వాహనాలు, పరికరాలను సమకూరుస్తున్నామని చెప్పారు. తొలి దశలో రూ. 33 కోట్లతో 65 అగ్నిమాపక వాహనాలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చామని, రెండో దశలో రూ. 40 కోట్లతో 58 వాహనాలను ప్రారంభించామని తెలిపారు. మూడో దశలోనూ మరిన్ని వాహనాలు, ఫైర్ ఫైటింగ్ పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు.

### 17 కొత్త ఫైర్ స్టేషన్లు..

ఫైర్ స్టేషన్లలో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. రాష్ట్రంలో 17 కొత్త ఫైర్ స్టేషన్ భవనాల నిర్మాణం జరుగుతోందని, ఒక్కో భవనానికి రూ. 2.25 కోట్ల చొప్పున వ్యయం చేస్తున్నామని చెప్పారు. వీటిలో ఆరు భవనాల నిర్మాణం పూర్తయిందన్నారు.

మరో 36 ఫైర్ స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల మౌలిక వసతులను బలోపేతం చేసి, అత్యవసర సమయాల్లో ప్రజలకు మరింత వేగంగా సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో హోంమంత్రి అనిత, అగ్నిమాపక శాఖ డీజీ వెంకటరమణతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వారిని స్మరించుకుందాం..



నేడు ఆగస్టు 15 ఇండిపెండెన్స్ డే ను భారతదేశం జరుపుకుంటుంది. 1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్? పాలన నుంచి విముక్తి పొందింది. ఇది ఒక్కరోజులో లభించిన సంతోషం కాదు. ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు త్యాగాలు, పోరాటులు, చేసి జైలు జీవితాలు అర్పించడమే కాకుండా ప్రాణత్యాగాలు చేయడం వల్ల భారతీయులమైన మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాము. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రాణాలు అర్పించి జైలుకు వెళ్లిన స్వాతంత్ర్య సమరయోధుల్లో కొందరి గురించి ఇప్పుడు మనం తెలుసుకుందాం..

### భగత్ సింగ్..

'జీవితాన్ని ప్రేమిస్తాం.. మరణాన్ని ప్రేమిస్తాం.. మేం మరణించి..ఎర్రపూల వనంలో పూలై పూస్తాం.. ఉరికంబాన్ని ఎగతాళి చేస్తాం..నిప్పురవ్వల మీద నిదురిస్తాం" వారు నన్ను చంపవచ్చు. కానీ వారు నా ఆలోచనలను చంపలేరు. వారు నా శరీరాన్ని దహించగలరు. నా ఆత్మను దహించలేరు అంటూ నినాదించిన వ్యక్తి భగత్ సింగ్. 'భగత్ సింగ్'.. ఈ పేరు వింటే చాలు భారతీయుల రక్తం గర్వంతో ఉప్పొంగుతుంది. ఆయన ఆలోచనలు, ఆశయాలు, ఆవేశం ఎంతోమంది యువతకు స్ఫూర్తిదాయకం. భగత్ సింగ్ పూర్వపు పంజాబ్‌లోని, ఇప్పుడు పాకిస్తాన్‌లో ఉన్న లాయల్ జిల్లా బంగా సమీపంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలోని సంధు ఝూట్ కుటుంబంలో సర్దార్ కిషన్ సింగ్ , విద్యావతి దంపతులకు జన్మించాడు. ఈయన 28 సెప్టెంబర్, 1907 లో జన్మించారు. భగత్ అనే పదానికి "భక్తుడు" అని అర్థం. యువకుడిగా ఉన్నప్పుడే బ్రిటీష్ పాలనపై ఉద్యమించాడు. మార్క్సిస్ట్ సిద్ధాంతాలను సమర్థించి పంజాబీ ఉర్దూ భాషా వార్తా పత్రికలకు అమృత్ సర్ లో రచయితగా, సంపాదకుడిగా పనిచేశాడు. ఇంక్విలాబ్ జిందాబాద్, విప్లవం వర్థిల్లాలి అనే నినాదాలతో ఉద్యమాన్ని ముందుకు సాగించాడు. బ్రిటిషర్లపై తిరుగుబాటు చేసి 23 ఏళ్ల వయసులోనే ఉరి కొయ్యను ముద్దాడాడు. 1931, మార్చి 23న రాత్రి 7.30 గంటలకి భగత్ సింగ్‌తోపాటు విప్లవకారులు సుఖ్ దేవ్, రాజ్ గురులను హుస్సైన్‌వాలా జైల్లో బ్రిటీష్ పాలకులు ఉరి తీశారు. భగత్ సింగ్ ఉరితాడును ముద్దాడి తానే స్వయంగా మెడలో వేసుకుని తన ప్రాణాలను భరతమాతకోసం త్యాగం చేశాడు. దేశం కోసం చనిపోయేవారు ఎల్లకాలం బతికే ఉంటారని భగత్? చెసిన నినాదం తనకే సొంతమై షహీద్ భగత్ సింగ్ గా మిగిలిపోయారు.

### చంద్రశేఖర్ ఆజాద్..

నా పేరు ఆజాద్ స్వాతంత్ర్యం నా తండ్రి అని గొప్పగా చెప్పిన వ్యక్తి డా. చంద్రశేఖర్ ఆజాద్ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమర వీరుడు 1906 జులై 23 మధ్యప్రదేశ్‌లోని ఝబువా జిల్లాలోని భాబ్రాలో జన్మించాడు. 1922లో చౌరీ చౌరా ఘటన తర్వాత గాంధీజీ తన ఉద్యమాన్ని ఉపసంహరించడంతో ఆజాద్ కాంగ్రెస్ తీరుపై నిరాశచెందారు. దీని తరువాత ఆయన 1924లో పండిట్ రామ్ ప్రసాద్ బిస్మిల్, సచింద్రనాథ్ సన్యాల్, యోగేష్ చంద్ర ఛటర్జీ ఏర్పాటు చేసిన హిందుస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్‌లో చేరారు. దీనిలో చంద్రశేఖర్ తొలుత రామ్ ప్రసాద్ బిస్మిల్ నాయకత్వంలో 1925లో కాకోరి ఘటనలో చురుకుగా పాల్గొన్నారు. చంద్రశేఖర్ 15 ఏళ్ళ వయస్సులో ఒక కేసులో న్యాయమూర్తి ముందు హాజరయ్యారు. అక్కడ, న్యాయమూర్తి అతనిని నీపేరు ఏంటని అడిగినప్పుడు.. 'నా పేరు ఆజాద్, నా తండ్రి పేరు ఇండిపెండెన్స్, నా ఇల్లు జైలు' అని చెప్పారు. ఈ మాట విన్న న్యాయమూర్తి ఆగ్రహించి, చంద్రశేఖర్‌కు 15 కొరడా దెబ్బల శిక్ష విధించారు. ఇక అప్పటినుంచి చంద్రశేఖర్ పేరు ఆజాద్ అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న బ్రిటీషర్లు ఆజాద్ పై ఆకస్మాత్తుగా దాడి చేశారు. దీంతో బ్రీటీషర్ల చేతిలో చావడం ఇష్టం లేని ఆజాద్ తనను తానే కాల్చుకున్నాడు. 1931, ఫిబ్రవరి 27న ఆజాద్ అమరుడయ్యాడు.

### సుభాష్ చంద్రబోస్..

దేశ స్వాతంత్ర్యంలో వర్ధంతి లేని సమరయోద్ధుడుగా మిగిలిపోయాడు సుభాష్? చంద్రబోస్. 1879వ సంవత్సరం జనవరి 23వ తేదీ ఒడిశాలోని కటక్‌లో జానకీ నాథ్, ప్రభావతీ బోస్‌లకు నేతాజీ జన్మించారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 11 సార్లు జైలుకు వెళ్లిన సుభాష్ చంద్రబోస్.. ఆంగ్లేయుల కబంధ హస్తాల నుంచి భరతమాతను రక్షించేందుకు చలో ఢిల్లీ నినాదాన్ని ఇచ్చారు. నేతాజీ ఆధ్వర్యంలో 1944 ఫిబ్రవరి 4న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెండో ప్రపంచ యుద్ధం ఆరంభం కావడంతో ఆంగ్లేయులను దెబ్బ తీయడానికి ఇదే సువర్ణవకాశమని భావించారు. యుద్ధం ప్రారంభం కాగానే కూటమి ఏర్పాటు చేసే ఉద్దేశంతో రష్యా, జర్మనీ, జపాన్‌లో పర్యటించారు. అయితే నేతాజీ మరణం వెనుక ఉన్న మిస్టరీ ఇంకా వీడలేదు. 1945, ఆగస్టు 22న నేతాజీ ప్రయాణించిన యుద్ధ విమానం ప్రమాదానికి గురై ఆయన వీరమరణం పొందినట్లు జపాన్ రేడియో ప్రకటించింది. అయితే ఈ ప్రకటనపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో నేటికీ బోస్? వర్ధంతి లేని మహా వీరుడుగా నిలిచిపోయాడు.

### అల్లూరి సీతారామరాజు..

విప్లవం పేరు చెప్పగానే గుర్తువచ్చే వ్యక్తి అల్లూరి సీతారామరాజు . ఈ పేరు వినగానే బ్రీటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని నమ్మిన అల్లూరి.. తన పోరాట పటిమతో బ్రిటీష్ సైన్యాన్ని వణికించాడు. మన్యం ప్రాంతంలో గిరిజనులను సమీకరించి బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశాడు. 1897 జూలై 4న విశాఖపట్టణం జిల్లా,పద్మనాభం మండలంలోని పాండ్రంగిలో తాతగారైన (మాతామహుడు) మందలపాటి శ్రీరామరాజు ఇంట రాజు జన్మించాడు. రాజును ముద్దుగా చిట్టిబాబు అని పిలిచేవారు. 27 ఏళ్ల వయసులోనే బ్రిటిషు సామ్రాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు. 1922 డిసెంబరు 6న జరిగిన పోరులో 12 మంది అనుచరులను సీతారామరాజు కోల్పోవడంతో కొన్నాళ్లు పోరాటాలకు దూరంగా ఉన్నాడు. దీంతో అల్లూరి మరణించాడనే వదంతులు వినిపించాయి. అయితే ఆయన 1923 ఏప్రిల్‌లో అనుకోకుండా మళ్లీ ప్రత్యక్షమయ్యాడు. మరోసారి తెల్లవాళ్లపై దాడులకు దిగాడు. అల్లూరికి సాయం చేస్తున్నారన్న కోపంతో మన్యం ప్రజలను బ్రిటిషర్లు వేధించడం మొదలు పెట్టారు. తనకున్న అవకాశాలతో పూర్తి స్థాయిలో మన్యం ప్రజలకు రక్షణ కల్పించలేనని తెలిసి తెల్లదొరలకు రామరాజు లొంగిపోవాలనుకున్నాడు. తాను స్నానానికి చెరువు దగ్గరకు రాబోతున్నట్టుగా అల్లూరి అనుచరుల ద్వారా తెలుసుకున్న బ్రిటీష్ అధికారులు 1924 మే 7న ఏటి ఒడ్డున స్నానం చేస్తున్న అల్లూరిని బంధించారు. ఎటువంటి విచారణ జరపకుండా అదే రోజున ఆయన్ను కాల్చిచంపారు. వందేమాతరం స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి నినాదమై నిలిచింది. ఎందరో వీరుల త్యాగఫలితమే నేడు మనం జీవిస్తున్నా స్వేచ్ఛ జీవితం. మనం జరుపుకుంటున్నా స్వేచ్ఛా స్వాతంత్ర్యం. భారదీయులందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు..



అమీనా కలందర్ (కవిరత్న)
సీనియర్ జర్నలిస్ట్

# గొల్లపూడిలో ఇంటింటికీ తెలుగుదేశం

## - ప్రజలతో మమేకమైన : ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు



విజయవాడ రూరల్(ప్రశ్న న్యూస్) ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి చేరువ చేయడమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం గొల్లపూడిలో శుక్రవారం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని సావధానంగా విన్న ఆయన పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన వారికి పథకాల ప్రయోజనాలు అందేలా పార్టీ శ్రేణులు చొరవ చూపాలని సూచించారు. ప్రజల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడమే 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వసంత కృష్ణప్రసాదు పేర్కొన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడంలో పార్టీ కార్యకర్తలు వారధిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారుకార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తామని నాయకులు తెలిపారు.

# ప్రజాసమస్యల పరిష్కారమే ప్రజాదర్బారు ప్రధాన ఎజెండా

## - గొల్లపూడిలో: ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రజాదర్బారు




విజయవాడ రూరల్(ప్రశ్న న్యూస్) ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం చూపించడమే ప్రజాదర్బారు ప్రధాన ఉద్దేశమని మైలవరం ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు అన్నారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బారుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత సమస్యలతో పాటు గ్రామాల్లో నెలకొన్న మౌలిక వసతులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆర్థిక ఇబ్బందులు తదితర అంశాలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇతర శాఖలకు సంబంధించిన సమస్యలను ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, జాప్యానికి తావివ్వరాదని అధికారులకు స్పష్టం చేశారు.

### రూ.5.44 లక్షల ఎల్.ఓ.సీలు అందజేత

ప్రజాదర్బారులో భాగంగా వైద్య చికిత్స తదితర అవసరాల కోసం నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ. 5,44,905 విలువైన ఎల్.ఓ.సీ.లను ఎమ్మెల్యే అందజేశారు. గడ్డమణుగుకు చెందిన కోరకొప్పుల మరియదాసుకు రూ. 1,48,893, మైలవరానికి చెందిన మూలగిరి సుజాతకు రూ. 1,76,520, పొందుగలకు చెందిన పుల్లూరు విజయలక్ష్మికి రూ. 77,107, గొల్లపూడికి చెందిన కోక శ్రీలక్ష్మికి రూ. 1,42,385 చొప్పున ఎల్.ఓ.సీలు అందించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో ఆహ్లాదకరమైన వాతావరణం



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)**దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన మన శ్రీకాళహస్తి క్షేత్రానికి విచ్చేసే వేలాది దమంది భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం, సకల సౌకర్యాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన సంకల్పం. ఇందులో భాగంగా ఈరోజు శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో నిర్మాణం పూర్తి చేసుకున్న పలు కీలక అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగింది.

ముందుగా గేట్ నెం-1 వద్ద శ్రీ,కాళహస్తి మరియు భక్త కన్నప్పల దివ్య చరిత్రను ప్రతిబింబించే వర్ణచిత్రాలతో పాటు ఆహ్లాదకరమైన వాటర్‌ఫాల్స్‌ను భక్తుల కోసం అందుబాటులోకి తెచ్చాం. అలాగే నిత్యం జరిగే రాహు-కేతు సర్పదోష నివారణ పూజా సామగ్రిని పకడ్బందీగా సిద్ధం చేయడానికి ప్రత్యేక ప్యాకింగ్ విభాగాన్ని, గేట్ నెం-3 బ్రిడ్జి మెయిన్ ఎంట్రన్స్ వద్ద స్వామి-అమ్మవార్ల ప్రతిరూపాలతో తీర్చిదిద్దిన నూతన ప్రవేశ ప్రాంగణాన్ని ఆవిష్కరించడం జరిగింది. స్వామివారి సేవలో భాగస్వాములయ్యే భక్తులు,దాతల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నూతన డోనర్ సెల్ గదిని కూడా ప్రారంభించాం. నాడు మా నాన్న స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హెలికాప్టర్ ద్వారా కొండపై విత్తనాలు చల్లి పచ్చదనానికి నాంది పలకగా,నేడు ఆధునిక డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించి కొండ చుట్టూ దాదాపు 3 లక్షల విత్తన బంతులను విత్తన బంతులు వెదజల్లే సరికొత్త పర్యావరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, ట్రస్ట్ బోర్డ్ చైర్మన్, పాలకమండలి సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో భక్తజనులు పాల్గొన్నారు. శ్రీకాళహస్తిని ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా మరింత ఉన్నత శిఖరాలకు చేర్చేందుకు నిరంతరం కృషి చేస్తాం.

# స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేకత

## - స్వేచ్ఛా భారతానికి ప్రతీక

## - ఆగస్టు 15 ఎందుకు జరుపుకుంటాం?



**మంథని ( ప్రశ్న న్యూస్)** ప్రతి సంవత్సరం ఆగస్టు 15న భారతదేశం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటుంది. 1947 ఆగస్టు 15న భారతదేశం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొంది స్వతంత్ర దేశంగా అవతరించింది. ఎన్నో దశాబ్దాల పాటు సాగిన స్వాతంత్ర్య పోరాటం, ఎందరో మహనీయుల త్యాగాలు, లక్షలాది ప్రజల పోరాట ఫలితమే మనం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛ.ఎందరో మహనీయుల త్యాగాల ఫలితం,మహాత్మా గాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, సర్దార్ వల్లభభాయ్ పటేల్, బాల గంగాధర్ తిలక్, అల్లూరి సీతారామరాజు వంటి అనేక మంది మహనీయులు తమ జీవితాలను దేశ స్వాతంత్ర్యం కోసం అంకితం చేశారు. వారి త్యాగాలు, పోరాటాలు భారత స్వాతంత్ర్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.స్వాతంత్ర్యం అంటే కేవలం విముక్తి కాదు,స్వాతంత్ర్యం అంటే విదేశీ పాలన నుంచి విముక్తి పొందడం మాత్రమే కాదు. ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, గౌరవంతో జీవించే హక్కులు కల్పించడం కూడా. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావడం నిజమైన స్వాతంత్ర్యానికి అర్థం.జాతీయ జెండాకు ప్రత్యేక గౌరవంఆగస్టు 15న దేశవ్యాప్తంగా జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపిస్తూ స్వాతంత్ర్య,సమరయోధులకు నివాళులు అర్పిస్తాం. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంస్థల్లో వివిధ కార్యక్రమాలునిర్వహిస్తారు.

### యువతకు స్వాతంత్ర్య దినోత్సవ సందేశం

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది.స్వాతంత్ర్య సమరయోధులు కలలుగన్న బలమైన, అభివృద్ధి చెందిన, సమానత్వంతో కూడిన భారతదేశాన్ని నిర్మించేందుకు యువత విద్య, క్రమశిక్షణ, దేశభక్తి, బాధ్యతాయుత పౌరసత్వాన్ని అలవర్చుకోవాలి.

### మన బాధ్యత ఏమిటి?

దేశ స్వాతంత్ర్యాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత. రాజ్యాంగాన్ని గౌరవించడం, చట్టాలను పాటించడం,పర్యావరణాన్ని పరిరక్షించడం, ప్రజా ఆస్తులను కాపాడటం, సమాజంలో సోదరభావాన్ని పెంపొందించడం ద్వారా దేశ నిర్మాణంలో మన వంతు పాత్ర పోషించాలి. స్వేచ్ఛను కాపాడుకుందాం -- దేశాన్ని అభివృద్ధి చేద్దాంస్వాతంత్ర్య దినోత్సవం ఒక పండుగ మాత్రమే కాదు... మన చరిత్రను గుర్తుచేసే పవిత్రమైన రోజు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, వారి ఆశయాలను ఆచరణలో పెట్టి, ఐక్యంగా ముందుకు సాగడమే వారికి మనం అందించే నిజమైన నివాళి."త్యాగాల పునాదులపై నిర్మించిన స్వాతంత్ర్యాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత."

# సంతగుడిపాడులో టీడీపీకి షాక్

## - వైఎస్సార్‌సీపీలోకి పలువురు టీడీపీ శ్రేణుల చేరిక



రొంపిచర్ల(ప్రశ్న న్యూస్ ).సంతగుడిపాడు గ్రామంలో రాజకీయంగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన పలువురు టీడీపీ శ్రేణులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు కాటా రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.వైఎస్సార్‌సీపీ సంతగుడిపాడు సెక్రటరీ నామాల ప్రసన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన కదురు ఏసుదానం, బుజ్జి దంపతులతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీలో చేరినట్లు నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా నామాల ప్రసన్నారెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విధానాలు, పార్టీ నాయకత్వంపై నమ్మకంతో పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని పేర్కొన్నారు.గ్రామ అధ్యక్షుడు కాటా రామిరెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కొత్తగా చేరిన వారికి పార్టీలో తగిన ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు.అనంతరం సంతగుడిపాడు సెంటర్‌లోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'జై జగన్.. జై రాజశేఖర్‌రెడ్డి' అంటూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో కేబుల్ సుబ్బారెడ్డి, కాటా రామిరెడ్డి, నామాల కోటిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు నామాల మీనారెడ్డి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాంబే కాలనీకి తాగునీటి కష్టాలకు చెక్

## - రూ.81.14 కోట్లతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు శంకుస్థాపన



**విజయవాడ(ప్రశ్న న్యూస్)** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎంపీ కేశినేని చిన్ని అన్నారు. సింగ్‌నగర్ వాంబే కాలనీ వాసుల చిరకాల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపే దిశగా అమృత్ 2.0 పథకం కింద రూ. 81.14 కోట్లతో చేపట్టనున్న నూతన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు శుక్రవారం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు.అంతకుముందు సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం వద్ద నిరుపేదలకు టిఫిన్ బండ్లను పంపిణీ చేశారు. అనంతరం వాంబే కాలనీకి చేరుకుని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ.. వాంబే కాలనీ ప్రజలు చాలా కాలంగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం, ఎంపీ నిధులు, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి సహకారంతో ఎమ్మెల్యే బోండా ఉమా నియోజకవర్గ అభివృద్ధికి దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని అన్నారు.బోండా ఉమా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు చేపడుతున్నందునే ఆయనకు ప్రజల నుంచి అనూహ్యమైన మద్దతు లభిస్తోందని చిన్ని అన్నారు. నియోజకవర్గంలో కొందరు నాయకులు ఇళ్లకే పరిమితమై మీడియా ప్రకటనలు చేయడం తప్ప ప్రజల సమస్యల పరిష్కారానికి ఏం చేశారో చెప్పాలని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, అభివృద్ధి కోసం పనిచేసే వారికి ప్రజల మద్దతు తప్పకుండా ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో గొట్టుముక్కల రఘురామరాజు, కంచి ధనశేఖర్, పైడి తులసి, నవనీతం సాంబశివరావు, దాసరి ఉదయ్‌శ్రీ, సుల్తానా, గవర సూర్య తదితరులు పాల్గొన్నారు.


# అర్ధరాత్రి మోగిన స్వేచ్ఛా ఘంటిక..

# రెండు శతాబ్దాల బానిస సంకెళ్లకు ముగింపు

## - 1947 ఆగస్టు 15: బ్రిటిష్ పాలన నుంచి భారతీయుల చేతుల్లోకి దేశ పరిపాలన... లక్షలాది మంది త్యాగాలకు దక్కిన చారిత్రక ఫలితం

(తోట వెంకట్ --ప్రశ్న న్యూస్ ఏపీ బ్యూరో)


The Hindustan Times
INDIA INDEPENDENT : BRITISH RULE ENDS
CONSTITUENT ASSEMBLY TAKES OVER
MOUNTBATTEN'S APPOINTMENT AS GOVERNOR-GENERAL ENDORSED
COLOURFUL CEREMONY MARKS BIRTH OF NATION



1947 ఆగస్టు 15.. భారత చరిత్రలో ఇది ఒక సాధారణ తేదీ కాదు. వేల ఏళ్ల నాగరికత కలిగిన ఈ దేశం రెండు శతాబ్దాల విదేశీ పాలనకు ముగింపు పలికి, స్వయం పరిపాలనను తిరిగి పొందిన మహత్తర ఘట్టం. ఆ రోజు ఉదయించిన సూర్యుడు కేవలం కొత్త రోజును మాత్రమే కాదు, స్వేచ్ఛ, ఆత్మగౌరవం, ప్రజాస్వామ్యం, స్వయం నిర్ణయాధికారానికి నాంది పలికిన కొత్త భారతాన్ని కూడా చూసాడు.

దాదాపు 190 సంవత్సరాల పాటు బ్రిటిష్ పాలన భారతదేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా దెబ్బతీసింది. ఒకప్పుడు ప్రపంచ వాణిజ్యంలో అగ్రస్థానంలో ఉన్న భారతదేశం, బ్రిటిష్ విధానాల కారణంగా పేదరికం, కరువులు, నిరుద్యోగం, దోపిడీకి గురైంది. రైతు చెమటతో పండిన పంటకు ధర లేకుండా పోయింది. భారతీయ పరిశ్రమలు కుప్పకూలాయి. స్వదేశీ చేతివృత్తులు నాశనమయ్యాయి. ప్రజల సంపద సముద్ర మార్గాల ద్వారా లండన్‌కు చేరింది.అయితే భారతీయుల ఆత్మగౌరవాన్ని ఏ విదేశీ పాలన కూడా శాశ్వతంగా అణచలేకపోయింది. 1857 తొలి స్వాతంత్ర్య సమరం నుంచి మొదలైన ప్రతిఘటన క్రమంగా జాతీయోద్యమంగా రూపుదిద్దుకుంది. ఒకవైపు అహింసా మార్గంలో మహాత్మా గాంధీ ప్రజలను ఏకం చేయగా, మరోవైపు



విప్లవకారులు తమ ప్రాణాలను పణంగా పెట్టి స్వేచ్ఛా జ్యోతిని వెలిగించారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, మహిళలు, గిరిజనులు---ప్రతి వర్గం స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వామ్యమైంది.

### 'భారత్ విడిచి పో' నుంచి స్వాతంత్ర్య ద్వారం వరకు

1942లో ప్రారంభమైన "క్విట్ ఇండియా" ఉద్యమం బ్రిటిష్ ప్రభుత్వానికి చివరి హెచ్చరికగా మారింది. "భారత్‌ను విడిచి వెళ్లండి" అనే నినాదం దేశమంతా మారుమోగింది. వేలాది మంది జైళ్లకు వెళ్లారు. వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. కానీ ఉద్యమం ఆగలేదు.ఇదే సమయంలో రెండో ప్రపంచ యుద్ధం బ్రిటన్‌ను ఆర్థికంగా తీవ్రంగా బలహీనపరిచింది. యుద్ధానంతర పరిస్థితుల్లో భారతదేశాన్ని బలవంతంగా పాలించడం అసాధ్యమని బ్రిటిష్ ప్రభుత్వం గ్రహించింది. ప్రపంచవ్యాప్తంగా వలస పాలనకు వ్యతిరేకంగా అభిప్రాయాలు పెరగడం కూడా కీలకంగా మారింది.1946లో జరిగిన నౌకాదళ తిరుగుబాటు, దేశవ్యాప్తంగా పెరిగిన ప్రజా ఉద్యమాలు, స్వాతంత్ర్య డిమాండ్ మరింత ఉధృతం కావడంతో బ్రిటిష్ ప్రభుత్వం అధికార బదిలీకి సిద్ధమైంది.

### అధికార బదిలీకి తుది నిర్ణయం

బ్రిటిష్ ప్రధాని క్లెమెంట్ అట్లీ ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలని నిర్ణయించింది. చివరి వైస్రాయ్‌గా లార్డ్ మౌంట్‌బ్యాటన్ భారతదేశానికి వచ్చారు. రాజకీయ చర్చలు, సంప్రదింపులు, విభజన నిర్ణయాల అనంతరం 1947 ఆగస్టు 15న అధికార బదిలీ జరగాలని ప్రకటించారు.ఇది కేవలం ఒక ప్రభుత్వ మార్పు కాదు. శతాబ్దాల బానిసత్వం నుంచి ఒక జాతి స్వయం పాలనలోకి అడుగుపెట్టిన క్షణం.

### అర్ధరాత్రి చరిత్ర సృష్టించిన వేళ

1947 ఆగస్టు 14 అర్ధరాత్రి.. గడియారం 12 కొట్టగానే భారతదేశం అధికారికంగా స్వతంత్ర దేశంగా అవతరించింది. ఢిల్లీలోని రాజ్యాంగ సభ మందిరంలో చారిత్రక సమావేశం జరిగింది. దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజాప్రతినిధులు ఆ మహత్తర ఘట్టానికి సాక్షులయ్యారు.ఆ సభలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన చారిత్రక ప్రసంగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. "ప్రపంచం నిద్రలో ఉండగా, భారత్ జీవితం, స్వేచ్ఛ కోసం మేల్కొంటోంది" అనే భావంతో చేసిన ఆ ప్రసంగం స్వతంత్ర భారత ఆత్మను ప్రతిబింబించింది.ఆ క్షణం నుంచి భారతదేశం బ్రిటిష్ పాలిత దేశం కాదు. స్వతంత్ర, సార్వభౌమ దేశం.

### త్యాగాల ఫలితమే స్వేచ్ఛ

ఈ స్వాతంత్ర్యం ఒక్కరోజులో రాలేదు. వేలాది మంది అమరవీరుల త్యాగాలు, లక్షలాది మంది ఉద్యమకారుల పోరాటం, కోట్లాది మంది భారతీయుల ఆశయాల సమ్మేళనమే 1947 ఆగస్టు 15.ఉరికంబాలను ముద్దాడిన యువకులు.. లాఠీ దెబ్బలు తిన్న ఉద్యమకారులు.. జైళ్లలో జీవితాలు గడిపిన నాయకులు.. ఆస్తులు కోల్పోయిన కుటుంబాలు.. రక్తంతో స్వేచ్ఛకు ధర చెల్లించిన అమరులందరికీ ఆ రోజు నిజమైన గౌరవం దక్కింది.

### స్వేచ్ఛా సంబరాల్లోనే విభజన విషాదం.. రక్తంతో తడిసిన సరిహద్దులు

1947 ఆగస్టు 15 భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టినా, అదే సమయంలో దేశ విభజన అనే విషాదాన్ని కూడా మిగిల్చింది. దాదాపు రెండు శతాబ్దాల బ్రిటిష్ పాలన ముగిసిన వేళ, మతపరమైన విభేదాలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో భారత్, పాకిస్తాన్ అనే రెండు స్వతంత్ర దేశాలు ఏర్పడ్డాయి. స్వేచ్ఛ కోసం ఎదురుచూసిన ప్రజలకు ఇది ఒకవైపు ఆనందం అయితే, మరోవైపు కన్నీటి చరిత్రగా మారింది.

### విభజన... చరిత్రలోనే అతిపెద్ద వలస

దేశ విభజన ప్రకటించగానే లక్షలాది మంది తమ పుట్టిన ఊర్లను, పూర్వీకుల ఇళ్లను విడిచి వెళ్లాల్సి వచ్చింది. పంజాబ్, బెంగాల్ ప్రాంతాల్లో మత ఘర్షణలు చెలరేగాయి. రైళ్లు శరణార్థులతో నిండిపోయాయి. అనేక కుటుంబాలు విడిపోయాయి. వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. చరిత్రకారులు దీనిని ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద మానవ వలసల్లో ఒకటిగా పేర్కొంటారుస్వాతంత్ర్య వేడుకల ఆనందం ఢిల్లీలో కనిపిస్తుంటే, సరిహద్దు ప్రాంతాల్లో మాత్రం కన్నీటి ప్రవాహం కొనసాగింది. స్వేచ్ఛకు చెల్లించిన అత్యంత విషాదకరమైన మూల్యంగా ఈ విభజన చరిత్రలో నిలిచిపోయింది.

### స్వతంత్ర భారత తొలి ప్రభుత్వం

అధికార బదిలీతో పాటు స్వతంత్ర భారత తొలి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టింది. దేశ తొలి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ బాధ్యతలు స్వీకరించారు. తొలి మంత్రివర్గం దేశ పునర్నిర్మాణ బాధ్యతను చేపట్టింది. ప్రజాస్వామ్య భారత నిర్మాణానికి బాటలు వేసింది.దేశమంతా సంస్థానాలుగా విడిపోయి ఉన్న పరిస్థితుల్లో వాటిని భారత యూనియన్‌లో విలీనం చేయడం అత్యంత క్లిష్టమైన పని. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తూ అనేక సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. దేశ సమైక్యతకు ఇది అత్యంత కీలక ఘట్టంగా నిలిచింది.

### ఎర్రకోటపై ఎగిసిన త్రివర్ణ పతాకం

స్వాతంత్ర్యం అనంతరం ఢిల్లీలోని ఎర్రకోటపై భారత త్రివర్ణ పతాకం ఎగురవేయడం దేశ ప్రజల్లో అపారమైన ఉత్సాహాన్ని నింపింది. శతాబ్దాల పాటు విదేశీ జెండా ఎగిరిన నేలపై భారత జాతీయ పతాకం రెపరెపలాడడం ప్రతి భారతీయుడి గుండెల్లో గర్వాన్ని నింపింది.ఆ క్షణం కేవలం జెండా ఎగరవేయడం మాత్రమే కాదు. అది బానిసత్వంపై స్వేచ్ఛ సాధించిన విజయానికి ప్రతీక. ప్రతి రంగు ఒక సందేశాన్ని ఇచ్చింది---త్యాగం, శాంతి, అభివృద్ధి, ధర్మచక్రం ద్వారా నిరంతర ప్రగతి.

### స్వేచ్ఛతో పాటు వచ్చిన సవాళ్లు


స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే దేశం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. విభజన కారణంగా శరణార్థుల పునరావాసం, ఆర్థిక సంక్షోభం, ఆహార కొరత, సామాజిక అశాంతి, పరిపాలనా పునర్వ్యవస్థీకరణ వంటి అనేక సమస్యలు ఒకేసారి ఎదురయ్యాయి.అయినప్పటికీ, కొత్త ప్రభుత్వం వెనుకడుగు వేయలేదు. ప్రజల సహకారంతో కొత్త భారత నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ, రాజ్యాంగ రచనను వేగవంతం చేసింది. ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేసింది.

### స్వేచ్ఛ అంటే బాధ్యత కూడా

1947 ఆగస్టు 15 భారతీయులకు స్వేచ్ఛను ఇచ్చింది. అదే సమయంలో బాధ్యతను కూడా అప్పగించింది. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడం, ప్రజాస్వామ్య విలువలను కాపాడడం, సామాజిక సమానత్వాన్ని పెంపొందించడం ప్రతి భారతీయుడి కర్తవ్యంగా మారింది.స్వాతంత్ర్యం అంటే కేవలం విదేశీ పాలన ముగియడం కాదు. దేశాన్ని స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లడం, పేదరికం, నిరక్షరాస్యత, అన్యాయం వంటి సంకెళ్ల నుంచి విముక్తి కల్పించడం కూడా స్వేచ్ఛ యొక్క అసలైన అర్థమని ఆ కాలం నాయకులు స్పష్టం చేశారు. బానిస భారతం నుంచి ప్రజాస్వామ్య భారతం వరకు... ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన ప్రస్థానం 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం లభించిన తర్వాత భారతదేశం ముందు ఉన్న అతిపెద్ద ప్రశ్న ఒక్కటే---"ఇకపై దేశాన్ని ఏ దిశగా నడిపించాలి?" విదేశీ పాలన నుంచి విముక్తి లభించింది. కానీ ఆర్థికంగా వెనుకబడిన, సామాజికంగా విభిన్నమైన, వందలాది సంస్థానాలుగా విడిపోయిన దేశాన్ని ఒకే జాతీయ స్ఫూర్తితో ముందుకు నడిపించడం అంత సులభం కాదు. అయినప్పటికీ భారత నాయకత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, సమాన హక్కులను పునాదులుగా ఎంచుకుని కొత్త భారత నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

### రాజ్యాంగ నిర్మాణం... కొత్త భారతానికి పునాది

స్వాతంత్ర్యం అనంతరం రాజ్యాంగ సభ దేశానికి ఒక సమగ్ర రాజ్యాంగాన్ని రూపొందించే పనిని ప్రారంభించింది. దాదాపు మూడు సంవత్సరాలపాటు జరిగిన చర్చలు, వందలాది



సూచనలు, అనేక సవరణల అనంతరం భారత రాజ్యాంగం సిద్ధమైంది. 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిన రాజ్యాంగం భారతదేశాన్ని సార్వభౌమ, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది.

ఈ రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, భావ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వేచ్ఛ, న్యాయం, అవకాశాల్లో సమానత్వం వంటి ప్రాథమిక హక్కులను కల్పించింది. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా ఇది గుర్తింపు పొందింది.

### వైవిధ్యంలో ఏకత్వం... భారత బలం

భాషలు వేరు, సంస్కృతులు వేరు, ఆచారాలు వేరు, సంప్రదాయాలు వేరు. అయినా భారతదేశం ఒకే జాతీయ పతాకం కింద, ఒకే రాజ్యాంగం ఆధారంగా ముందుకు సాగింది. "వైవిధ్యంలో ఏకత్వం" అనే భావన ప్రపంచానికి భారతదేశాన్ని ప్రత్యేకంగా నిలబెట్టింది.విభజన గాయాలు ఇంకా మానకముందే దేశ ప్రజలు అభివృద్ధి దిశగా అడుగులు వేయడం ప్రారంభించారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు చేపట్టారు.

### ఆకలి నుంచి ఆత్మనిర్భరత వరకు

స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దాల్లో భారతదేశం తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంది. విదేశాల నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే శాస్త్రీయ వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, అధిక దిగుబడి విత్తనాల వినియోగంతో దేశం క్రమంగా ఆహార ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించింది. రైతు కష్టానికి విలువ పెరిగింది. పచ్చని పొలాలు స్వతంత్ర భారత విజయగాథగా నిలిచాయి.

### శాస్త్ర, సాంకేతిక రంగాల్లో కొత్త శకం

స్వాతంత్ర్యం తర్వాత విజ్ఞానానికి భారతదేశం అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. పరిశోధనా సంస్థలు, ఉన్నత విద్యా సంస్థలు, శాస్త్రీయ ప్రయోగశాలలు స్థాపించబడ్డాయి. అంతరిక్ష పరిశోధనలో భారతదేశం ప్రపంచ దేశాల సరసన నిలిచింది. ఉపగ్రహాల ప్రయోగం నుంచి చంద్రుడు, అంగారక గ్రహ పరిశోధనల వరకు భారత్ తన సామర్థ్యాన్ని చాటుకుంది.సమాచార సాంకేతిక రంగంలో భారత యువత ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. భారతీయ నైపుణ్యం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించే స్థాయికి ఎదిగింది.

### ప్రజాస్వామ్యానికి భారతమే చిరునామా

స్వాతంత్ర్యం తర్వాత భారతదేశం ఎంచుకున్న గొప్ప మార్గం ప్రజాస్వామ్యం. కోట్లాది మంది ఓటర్లు తమ నాయకులను స్వేచ్ఛగా ఎన్నుకునే వ్యవస్థను విజయవంతంగా కొనసాగించడం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అధికార మార్పిడి ఎన్నికల ద్వారా శాంతియుతంగా జరుగుతూ రావడం భారత ప్రజాస్వామ్య బలాన్ని చాటుతోంది.ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ నిలవడం వెనుక ప్రజల విశ్వాసం, రాజ్యాంగంపై నమ్మకం, ఎన్నికల వ్యవస్థపై గౌరవం ప్రధాన కారణాలుగా నిలిచాయి.

### స్వాతంత్ర్యం ఇచ్చిన పాఠం

1947 ఆగస్టు 15 కేవలం బ్రిటిష్ పాలన ముగిసిన రోజు మాత్రమే కాదు. భారతీయులు తమ భవిష్యత్తును తామే నిర్మించుకోవాలని నిర్ణయించుకున్న రోజు. త్యాగాల ద్వారా వచ్చిన స్వేచ్ఛను అభివృద్ధి, సమానత్వం, శాంతి, సామరస్యంతో కాపాడుకోవాలని దేశం చేసిన ప్రతిజ్ఞకు అది నాంది.అయితే ఇంకా పేదరికం, నిరుద్యోగం, అవినీతి, సామాజిక అసమానతలు, పర్యావరణ సమస్యలు వంటి సవాళ్లు దేశం ముందున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులు కలలు కన్న భారతాన్ని సాకారం చేయాలంటే ప్రతి పౌరుడు తన బాధ్యతను గుర్తించి దేశ నిర్మాణంలో భాగస్వామి కావాలి.

# నా మాటలను వక్రీకరించారు

## - అనసూయ భరద్వాజ్



హిందూ ధర్మం, సనాతన ధర్మంపై గతంలో తాను చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేగడంతో... సినీ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ సోషల్ మీడియా వేదికగా స్పందించింది. తన మాటలను కొందరు కావాలనే వక్రీకరించి ఉద్దేశపూర్వకంగా నెగిటివ్ ప్రచారం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తాను ఏ మతాన్ని కించపరచనని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తానని అనసూయ స్పష్టం చేసింది. తాను సనాతన ధర్మాన్ని పాటించే పక్కా హిందువునని, తన ధర్మం, విలువలు, విశ్వాసాల పట్ల తనకు ఎలాంటి అనుమానం లేదని పేర్కొంది. తాను చెప్పిన అసలు విషయాన్ని పక్కన పెట్టి, సనాతన ధర్మాన్ని అవమానించినట్లు ప్రచారం చేయడం సరికాదని హితవు పలికింది. అసలు ఏం జరిగిందంటే... గతంలో ఒక సందర్భంలో అనసూయ మాట్లాడుతూ.. 'జై శ్రీరామ్' అనే నినాదం ముసుగులో కొందరు దాడులకు తెగబడుతున్నారని, కేవలం నినాదాలు చేయడం కంటే వ్యక్తుల ప్రవర్తనే ముఖ్యమని వ్యాఖ్యానించడమే ఈ వివాదానికి కారణమైంది. సనాతన ధర్మం పేరుతో దాడులు చేయడాన్ని ప్రశ్నించిన ఆమె, తాను శ్రీరాముడినే కొలుస్తానని, ఆ భక్తితోనే తన పెద్ద కుమారుడికి హనుమంతుడి పేరు పెట్టుకున్నానని వివరించింది. ఈ వ్యాఖ్యలపై హిందూ సంఘాలు, నెటిజన్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవడంతో, పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆమె తాజాగా ఈ వివరణ ఇచ్చింది.

# విషపూరిత బంధాన్ని తెంచుకున్నా



వ్యక్తిగత విషయాలను ఎక్కువశాతం చాలామంది గోప్యంగానే ఉంచుతారు. బహిర్గతం చేసుకోరు. కానీ అందుకు భిన్నమైన వ్యక్తిత్వం నటి అనుపమ పరమేశ్వరన్‌ది. తన అనుభవాలు ఇతరులకు హెచ్చరికలా ఉండాలనే ఉద్దేశ్యంతో ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నిర్మొహమాటంగా మనసును ఆవిష్కరించారామె. 'ప్రేమ పేరుతో ఓ వ్యక్తి కొన్నేళ్ల క్రితం నా జీవితంలోకి వచ్చాడు. పరిచయమైన మూడు నెలలకే నిశ్చితార్థం, వివాహం అంటూ బలవంతపెట్టడం మొదలుపెట్టాడు. ఆ తొందరపాటులో ప్రేమకంటే నన్ను నియంత్రించాలనే ఆత్రమే ఎక్కువ కనిపించేది. నేను ధరించే దుస్తులు, సోషల్ మీడియాలో నేను పెట్టే పోస్టులు, చివరికి నేను ఎంచుకునే సినిమాల విషయంలో కూడా ఆంక్షలు విధించడం మొదలుపెట్టాడు. అసలు నటనకే నన్ను దూరం చేయాలని చూశాడు. దాంతో స్వేచ్ఛకు దూరమై మానసికంగా నలిగిపోయాను. కేరవాన్‌లో ఒంటరిగా కూర్చొని ఏడ్చేదాన్ని. ఒక్కోసారి అతని ప్రవర్తన భయం కలిగించేది.

ఈ ఆందోళన వల్ల బరువు తగ్గిపోయాను. నా కెరీర్‌లోనే అతి పెద్ద విజయమైన 'డ్రాగన్' సినిమా ప్రమోషన్స్‌కి నేను హాజరు కాకపోవడానికి కారణం కూడా అతనే. అందుకే ఆ విషపూరిత బంధాన్ని అతికష్టం మీద తెంచుకున్నా. ప్రస్తుతం ఆ మానసిక గాయం నుంచి కోలుకునే పనిలో ఉన్నా' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది అనుపమ. అయితే ఆ వ్యక్తి ఎవరో మాత్రం ఆమె వెల్లడించలేదు. అగ్రహీరో విక్రమ్ తనయుడు ధృవ్‌తో ఆమె కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నట్టు వార్తలొచ్చిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్వ్యూలో అనుపమ వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

# 'విశ్వనాథ్ అండ్ సన్స్' మూవీ రివ్యూ



కుటుంబ కథలతో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ సినిమాలకు ఉన్న క్రేజ్, దాని బాక్సాఫీస్ లెక్కలు కూడా వేరుగా ఉంటాయి. కుటుంబ భావోద్వేగాలు, ఎంటర్‌టైన్‌మెంట్ జతకలిస్తే థియేటర్‌లు ఫ్యామిలీ ప్రేక్షకులతో కళకళలాడుతాయి. అందుకే కాబోలు గత కొంతకాలంగా ఫ్యామిలీ సినిమాలకు దూరంగా ఉన్న దర్శకులు, హీరోలు ఇప్పుడు అలాంటి సినిమాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కోవలోనే హీరో సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రం ఎలా ఉంది? దర్శకుడు వెంకీ అట్లూరి హీరో సూర్యకు సక్సెస్‌ఫుల్ సినిమానిచ్చాడా? 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాలో ప్రేక్షకులు అలరించే అంశాలున్నాయా? లేదా? రివ్యూలో తెలుసుకుందాం. (సంజయ్ విశ్వనాథ్ (సూర్య) ఓ సంపన్న వ్యాపార కుటుంబానికి చెందిన వారసుడు. ఒకవైపు బిజినెస్ చూసుకుంటూనే మరొక వైపు అమ్మ (రాధికా శరత్ కుమార్) కోరిక మేరకు రైఫిల్ షూటింగ్‌లో నైపుణ్యం సంపాందించి భారత్ తరపున ఒలింపిక్స్‌లో పాల్గొని బంగారు పతాకం గెలుస్తాడు. అయితే వివాహం విషయంలో ఆయన మనసులో ఉన్న ఓ అభిప్రాయం కారణంగా 40 ఏండ్లు దాటినా పెళ్లి చేసుకోడు. ఆయన చిన్నప్పుడు తన ఫ్యామిలీలో జరిగిన కొన్ని సంఘటనలే అందుకు కారణం. తల్లి మాత్రం పెళ్లి చేసుకుని కుటుంబానికి వారసుడిని ఇవ్వాలని సంజయ్‌ని పదే పదే కోరుతుంది. దీంతో ఓ డాక్టర్ సలహాతో అమెరికా వెళ్లి సరోగసి ద్వారా ఓ బాలుడిని కని ఇంటికి తీసుకొస్తాడు. అయితే అనుకోకుండా ఆ బాబు అనారోగ్యానికి గురవుతాడు. బాబు అనారోగ్యం నయం కావాలంటే కన్నతల్లి అవసరం పడుతుంది. దీంతో బాబు కన్నతల్లి గురించి అమెరికా వెళతాడు సంజయ్ విశ్వనాథ్. ఇక బాబుకు జన్మనిచ్చిన తల్లి దొరికిందా? అమెరికా నుంచి ఇండియాకు రావటానికి ఆమె ఒప్పుకుందా? ఒప్పుకుంటే ఎలా కండిషన్స్ పెట్టింది? సంజయ్ తల్లి కోరిక మేరకు పెళ్లి చేసుకున్నాడా? సంజయ్ జీవితంలో మ్యాడీ (మమిత బైజు) ఎలా వచ్చింది? ఆమె వచ్చిన తరువాత ఆయన జీవితంలో వచ్చిన మార్పులేమిటి? తదితర విషయాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. కుటుంబ భావోద్వేగాలతో కూడిన కథకు డీసెంట్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించి కుటుంబ మొత్తం హాయిగా కూర్చొని ఆస్వాదించే విధంగా ఉన్న ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. సినిమా ప్రారంభమైన తొలి సన్నివేశం నుంచే ఎంతో ఆహ్లాదంగా అనిపిస్తూ చివరి సన్నివేశం వరకు మనసుకు హత్తుకునే విధంగా ఈ సినిమాను మలిచారు దర్శకుడు వెంకీ అట్లూరి. హీరో సూర్యను ఇలాంటి స్టయిలిష్ రోల్‌లో చూసి చాలా రోజులైంది. ఆయన స్టైల్‌కు తగిన విధంగా ఓ బ్యాక్‌డ్రాప్‌ను ఎంచుకుని దానికి ఫ్యామిలీ ఎమోషన్స్‌ను మేళవించిన విధానం ఎంతో ప్రశంసనీయం. హీరో, హీరోయిన్ల మధ్య ఉన్న ఏజ్ గ్యాప్, సరోగసి ద్వారా బిడ్డను కనడం, దానితో ముడిపడిన ఎమోషన్స్, హీరోయిన్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన విధానం ఎంతో బాగుంది. ఈ సినిమా చూస్తున్నంత సేపు ఓ మంచి సినిమా చూస్తున్నం అనే ఆనందం సినిమా చూసే ప్రేక్షకుడికి మనసుకి కలుగుతుంది. సినిమా ప్రారంభం నుంచి కూడా ఎక్కడా కూడా సినిమాను డ్రాప్ అవ్వకుండా దర్శకుడు వెంకీ అట్లూరి డీల్ చేసిన విధానం ప్రశంసనీయం. 'కోపం, ద్వేషం కూడా కొంతకాలం తరువాత అలిసిపోతాయి' వంటి సంభాషణలు ఆలోచింపజేస్తాయి. చాలా చోట్ల దర్శకుడు వెంకీ అట్లూరిలో త్రివిక్రమ్ గారి శైలి కనిపించింది. ముఖ్యంగా డ్రైవర్ ముత్తుస్వామి, ఆయన కొడుకుతో ఓ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో సూర్య మాట్లాడిన విధానం, అంజలీ దేవి (రవీనా టాండన్) ఆమె కూతురు తల్లిదండ్రులతో ముడిపడిన సన్నివేశాలు ,అందరిని కంటతడి పెట్టిస్తుంది. ఇలాంటి ఎమోషన్ సన్నివేశాలు ఈ సినిమాలో అందరి హృదయాలకు హత్తుకోవడమే కాదు ఆలోచింపజేస్తాయి. ఈ సినిమాలో సూర్య మాస్ ఫ్యాన్స్ కోసం పెట్టిన యాక్షన్ ఏపిసోడ్స్ కూడా ఎంతో క్లాస్‌గానే ఉంటాయి. సినిమా ముగింపు కూడా ఎంతో క్లాస్‌గానే ఉంటుంది. సంజయ్‌గా హీరో సూర్య ఎంతో స్టయిలిష్‌గా కొత్త లుక్‌లో కనిపించాడు. సంజయ్ విశ్వనాథ్ పాత్రకు ఆయన వల్ల ఎంతో హుందాతనం వచ్చింది అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఆయన వయసును కనిపించకుండా దాచాలనే తాపత్రయం కూడా ఎక్కడా కనిపించదు. ఆయన నటన కొన్ని ఎమోషన్స్ సీన్స్‌ల్లో అందరిచేత భావోద్వేగానికి గురిచేసింది. ఇక ఈ సినిమాకు మరో హీరో మమిత బైజు ఆమె ఎనర్జీ, నటన ఈ సినిమాకు మరో బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్. ఆ పాత్రను దర్శకుడు చాలా చక్కగా డిజైన్ చేశాడు.

ఆమె నటన కూడా ఎంతో నేచురల్‌గా అనిపించింది. కథానాయకుడి తల్లిగా రాధికా శరత్‌కుమార్ నటన ఆకట్టుకుంది.సునీల్ రెడ్డి, రవీనా టాండన్, నాజర్ తదితరులు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఈ చిత్రానికి ఎమోషనల్ కంటెంట్ అనే ఫీల్‌ను కలిగిస్తుంది. ఫోటోగ్రఫీ ప్రతిభతో విజువల్స్ ఎంతో ప్లెజెంట్‌గా ఉన్నాయి. నిర్మాణ విలువలు బాగున్నాయి. ఈ మధ్య కాలంలో వచ్చిన వచ్చిన హార్ట్ టచ్చింగ్ క్లీన్ ఫ్యామలీ ఎంటర్ టైనర్ ఇది. ఒకవైపు ఎంటర్‌టైన్ చేస్తూనే మరో వైపు అందరి హృదయాలకు హత్తుకునే కథ, కథనాలతో సినిమా ఆద్యంతం అలరిస్తుంది. తప్పకుండా అందరూ ఫ్యామిలీతో చూడాల్సిన సినిమా.!

# మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను



'ఇందులో నా పాత్ర పేరు మహాదేవి. దేవుని అనుగ్రహంతో పుట్టే పాత్ర అది. నా ప్రిన్సిపల్స్ పక్కన పెట్టి మహాదేవిగా మారడానికి చాలా కష్టపడ్డాను. బుద్ధిజం పుస్తకాల్ని చదివాను' అన్నారు నటి కామాక్షి భాస్కర్ల. ఆమె ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'అగధ'. శ్రవణ్‌రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్ కీలక పాత్రధారులు. ఎమ్మెస్ రాజు దర్శకుడు. ఈ నెల 14న విడుదల కానున్నది. గురువారం హైదరాబాద్‌లో కామాక్షి భాస్కర్ల విలేకరులతో ముచ్చటించింది. 'ఎమ్మెస్ రాజుగారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఓకే చెప్పాను. కానీ ఎమ్మెస్ రాజుగారు కూర్చోబెట్టి కథ చెప్పి, నాపాత్రను వివరించారు. నిజంగా కథ, నా పాత్ర మనస్ఫూర్తిగా నచ్చాయి. ఇది కేవలం హారర్ థ్రిల్లర్ మాత్రమే కాదు. డివైన్ మూమెంట్స్ కూడా ఇందులో బలంగా ఉంటాయి. టెక్నికల్‌గా కూడా సినిమా అద్భుతంగా ఉంటుంది' అని తెలిపింది కామాక్షి భాస్కర్ల.

# 'అగధ' - మూవీ రివ్యూ!

భారీ చిత్రాల నిర్మాతగా ఎమ్మెస్ రాజుకి మంచి పేరు ఉంది. 'దేవి' .. 'దేవీ పుత్రుడు' వంటి ఫాంటసీ సినిమాలు ఆయన ఖాతాలో ఉన్నాయి. దైవశక్తి – దుష్ట శక్తి నేపథ్యంలో ఆయన రూపొందించిన తాజా చిత్రమే 'అగధ'. దర్శకుడిగా ఆయన తెరకెక్కించిన సినిమా ఇది. కామాక్షి భాస్కర్ల ప్రధానమైన పాత్రను పోషించిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. టైటిల్ తోనే అందరిలో ఆసక్తిని రేకెత్తించిన ఈ సినిమా ఆడియన్స్ ను ఎంతవరకూ ఆకట్టుకుందనేది చూద్దాం. మహాదేవి ( కామాక్షి భాస్కర్ల) తన చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోతుంది. అప్పటి నుంచి బాబాయ్ (భానుచందర్) దగ్గరే పెరుగుతుంది. బాబాయ్ కి ఇద్దరు భార్యలు .. మొదటి భార్యకి మహిమ (ఉల్కా గుప్తా) శ్రీలక్ష్మి అనే ఇద్దరు కూతుర్లు ఉంటారు. ఇక రెండవ భార్య సుశీల ( వనితా విజయ్ కుమార్)కి 'హరిణి' ( జోవిక విజయ్ కుమార్) అనే టీనేజ్ కూతురు ఉంటుంది. మహిమ చాలా కాలంగా 'శివ'ను ప్రేమిస్తుంటుంది. అతని కారణంగా ఆమె గర్భవతి అవుతుంది. అయితే ఒకానొక అడవీ ప్రదేశంలో .. 'షికావా' అనే గుహలోకి అడుగుపెట్టిన తరువాత వాళ్ల జీవితాలు మారిపోతాయి. గర్భవతిగా ఉన్న మహిమ ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. అంతే కాకుండా ఆమె చెల్లెలు 'హరిణి' ప్రవర్తనలో విపరీత ధోరణి చోటుచేసుకుంటుంది. ఈ నేపథ్యంలో ఉన్నపళంగా రావలసిందిగా మహాదేవికి ఆమె బాబాయ్ కబురుపెడతాడు. 'మహాదేవి'కి బాల్యంలోనే అమ్మవారి దర్శనమవుతుంది. అప్పటి నుంచి దుష్టశక్తులను నియంత్రించే శక్తులు ఆమెకి వస్తాయి. అందువలన దుష్టశక్తులచే పీడించబడుతున్నవాళ్లు ఆమెను ఆశ్రయిస్తుంటారు. అలాంటి మహాదేవి తన బాబాయ్ మాట మేరకు ఆ ఊరుకు చేరుకుంటుంది. అటవీ ప్రాంతంలో ఒక గుహలోకి వెళ్లి వచ్చిన తరువాతనే మహిమ ఆత్మహత్య చేసుకుందనీ, చనిపోవడానికి ముందు ఆమె 'అగధ'ను చూసిందని మహాదేవి తెలుసుకుంటుంది. 'అగధ' ఎవరు? మహిమ కుటుంబ సభ్యులపై అగధ ఎందుకు పగబడుతుంది? అడవిలోని ఆ గుహలో ఆ రోజు ఏం జరుగుతుంది? అగధ బారి నుంచి మహాదేవి తన కుటుంబ సభ్యులను కాపాడుకోగలుగుతుందా? మహిమను ప్రేమించిన శివ ఏమైపోయాడు? అనేది మిగతా కథ.చిన్నతనంలోనే అమ్మవారి అనుగ్రహాన్ని పొందిన మహాదేవి, దుష్టశక్తులను తరిమేసే అతీంద్రియ శక్తులను సొంతం చేసుకుంటుంది. తనని ఆశ్రయించిన వారిని దుష్టశక్తుల బారి నుంచి రక్షిస్తూ ఉంటుంది. ఆమెను పెంచి పెద్ద చేసిన బాబాయ్ ఫ్యామిలీ, 'అగధ' అనే దుష్టశక్తి బారిన పడుతుంది. అప్పుడు తన ఫ్యామిలీని కాపాడుకోవడం కోసం మహాదేవి ఏం చేస్తుంది? అనేదే ఈ కథలోని ప్రధానమైన అంశం. తన లవర్ శివ .. స్నేహితుడు బబ్లూతో కలిసి 'బస్తర్' ఫారెస్ట్ ఏరియాలోని 'షికావా' అనే కేవ్ దగ్గరికి మహిమ బయల్దేరడంతో ఈ కథ మొదలవుతుంది. మహిమ చనిపోవడం .. ఆమె చెల్లెలు 'హరిణి' ఏదో దుష్టశక్తి ఆవహించినట్టుగా ప్రవర్తించడంతో ఈ కథ పుంజుకుంటుంది. 'అగధ' ఎవరో .. ఆ దుష్టశక్తి ఉద్దేశమేమిటో తెలుసుకుని, హరిణిని రక్షించుకోవడం కోసం మహాదేవి రంగంలోకి దిగడంతో ఈ కథ మరో మలుపు తీసుకుంటుంది. ప్రీ క్లైమాక్స్ కి దగ్గర పడుతుండగా, కథ మరింత పుంజుకుని క్లైమాక్స్ దిశగా కదులుతుంది. సాధారణంగా హారర్ థ్రిల్లర్ .. ఫాంటసీ టచ్ ఉన్న థ్రిల్లర్ సినిమాలలో కామెడీ అనేది కాస్తయినా కనిపిస్తుంది. కానీ ఎమ్మెస్ రాజు ఈ కథను మొదటి నుంచి చివరివరకూ సీరియస్ గా నడిపించారు. కథ ఎక్కడా కూడా గాడి తప్పకుండా సాగుతుంది. అలాగే కథకి తగిన సన్నివేశాలు .. ఆ సన్నివేశాలకు అవసరమైన గ్రాఫిక్స్ ను డిజైన్ చేసుకున్న తీరు ఆసక్తికరంగా అనిపిస్తుంది. అడవి నేపథ్యం .. అమ్మవారి రూపం .. గుహకి సంబంధించిన గ్రాఫిక్స్ ఆకట్టుకుంటాయి.ఎన్నో వేల ప్రేతాత్మల శక్తులను తనలో నింపుకున్న దుష్టశక్తియే 'అగధ'. దైవశక్తిని ఎదిరించి నిలవడం.. గెలవడం దాని ప్రధానమైన ఉద్దేశం. అయితే ఈ లైన్ కి తగినట్టుగా తెరపై దుష్టశక్తి – దైవశక్తి పోరాడే సన్నివేశాలు ఉంటాయనుకుంటే పొరబాటే. దైవశక్తిని బాలా రూపంలోనూ .. దుష్టశక్తిని అద్దం పెంకులోను చూపించడంతో దర్శకుడు సరిపుచ్చారు. దుష్టశక్తిని హాలీవుడ్ సినిమాలలోని చిత్రమైన జీవిలా చూపించి ఆశ్చర్యపరిచారు.అడవి .. అక్కడి గిరిజనులు .. క్షుద్ర పూజలు .. నరబలులు .. 140 ఏళ్లకి ఒకసారి వచ్చే చంద్రగ్రహణం .. ఆ రోజునే శక్తులన్నీ పొందాలనుకున్న ఒక దుష్టశక్తి .. వంటి అంశాలు కథపై కాస్త ఉత్కంఠను పెంచుతాయి. అయితే ఈ అంశాలన్నీ గతంలోని సినిమాలలో కనిపిస్తూ .. వినిపిస్తూ వచ్చినవే. అవే సన్నివేశాలు నిదానంగా సాగుతూ ఉంటాయంతే. కాకపోతే విజువల్స్ .. చిత్రీకరణ పరంగా మెప్పిస్తూ వెళతాయి.



అయితే ఈ కథ మొత్తంలో అయోమయంలో పడేసే అంశం ఒకటి ఉంది. శివ .. సింహా .. సలీమ్ పాత్రలను ఒక్కరితో ఎందుకు వేయించారో అర్థం కాదు. క్లైమాక్స్ లో కార్లో వెళుతూ అందుకు గల కారణం ఏమిటో చెబుతారు కానీ, అది మనకి అర్థమైనట్టుగా .. కానట్టుగా ఉంటుంది. కామాక్షి భాస్కర్ల నటన బాగుంది. ఆమె ఎంపిక చాలా కరెక్టుగా అనిపిస్తుంది. కాకపోతే మహాదేవిగా ఆమె నుదుటున బొట్టు విషయంలో కూడా కొంచెం కేర్ తీసుకుని ఉండవలసిందని అనిపిస్తుంది.భానుచందర్ – వనితా విజయ్ కుమార్ పాత్రలలో కొంచెం వెయిట్ వేయాలసింది. వనిత కూతురు జోవిక బాగానే చేసింది. విలన్ పాత్ర విలక్షణంగా ఏమీ అనిపించదు. రాకేశ్ వెంకటాపురం నేపథ్య సంగీతం .. నాని చమిడిశెట్టి ఆవిష్కరించిన విజువల్స్ ఆకట్టుకుంటాయి. జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ ఫరవాలేదు. నిర్మాణ విలువలు .. గ్రాఫిక్స్ చెప్పుకోదగినవిగానే అనిపిస్తాయి. పాత అంశాలతో కూడిన కథనే .. నిదానంగా సాగే కథనమే, విజువల్స్ పరంగా మాత్రం తన మార్కు చూపిస్తూ సాగే సినిమాగా చెప్పుకోవచ్చు అంతే.

# జిల్లాలో సమృద్ధిగా యూరియా నిల్వలు

**- జిల్లాలో మొత్తం 2403 మెట్రిక్ టన్నుల యూరియా**

**- జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్**



**మెదక్ఈ ప్రతినిధి (ప్రశ్న న్యూస్)** జిల్లాలో సమృద్ధిగా యూరియా నిలువ 2403 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ తెలిపారు సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి దేవ్ కుమార్ శుక్రవారం ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో మొత్తం 2403 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ అందుబాటులో ఉంది. ఇందులో మార్క్‌ఫెడ్ వద్ద 1855 మెట్రిక్ టన్నులు మరియు రిటైలర్ల వద్ద 548 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. .07.08.2026 నుండి రైతులు ఖీూా యాప్ ద్వారా యూరియాను కొనుగోలు చేస్తున్నారు. అని తెలిపారు.. రైతులు ఖీూా యాప్ ద్వారా వచ్చిన మొత్తం యూరియా పరిమాణానికి సంబంధించి బుకింగ్ చేస్తున్నట్లు.వివరించారు. ప్రతిరోజూ యూరియా స్టాక్‌ను అందుబాటులో ఉంచుతున్నాము. అని తెలిపారు. రిటైలర్ కేంద్రాల వద్ద ఉన్న వాలంటీర్లు మరియు రైతు వేదికల వద్ద ఉన్న ాజుూలు రైతులకు ఖీూా యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు. అని తెలిపారు.ఖీూా యాప్‌ను వినియోగించడంలో ఇబ్బంది పడుతున్న రైతులకు బుకింగ్ చేయడంలో సహాయం అందిస్తూ, వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

# దేశ రక్షణకు ముస్లిం సమాజం ముందువరుసలో



**ఇబ్రహీంపట్నం(ప్రశ్న న్యూస్)** దేశ రక్షణ, సమగ్రత కోసం ముస్లిం సమాజం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూఖ్ షుబ్లీ అన్నారు. దేశానికి ఏ ఆపద వచ్చినా భారతీయ ముస్లింగా ముందువరుసలో నిలిచి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.కొండపల్లిలోని సుమారు 450 ఏళ్ల చరిత్ర కలిగిన హజరత్ సయ్యద్ షా బుకారీ దర్గా ఆవరణలో శుక్రవారం మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫరూఖ్ షుబ్లీ మాట్లాడారు.'దేశం కోసం--ధర్మం కోసం' అనే లక్ష్యంతో రాష్ట్రంలోని 65 నియోజకవర్గాల్లో లక్ష ఇళ్లకు జాతీయ జెండాలను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మైలవరం నియోజకవర్గ పరిధిలో 5 వేల ఇళ్లకు జాతీయ జెండాలను అందజేస్తున్నామని చెప్పారు.స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం మతపెద్దలు, పూర్వీకుల పిలుపు మేరకు వేలాది మంది ముస్లింలు దేశం కోసం ప్రాణత్యాగాలు చేశారని ఫరూఖ్ షుబ్లీ గుర్తుచేశారు. వారి త్యాగాల స్ఫూర్తితో నేటి తరం కూడా దేశ రక్షణ, సమగ్రతకు అంకితభావంతో పనిచేస్తుందని అన్నారు. దేశం పట్ల ముస్లిం సమాజానికి ఉన్న దేశభక్తిని ఎవరూ శంకించాల్సిన అవసరం లేదన్నారు.సూఫీ మతగురువు అల్తాఫ్ రజా మాట్లాడుతూ 450 సంవత్సరాల చరిత్ర కలిగిన బుకారీ దర్గా ఆవరణలో 'ఘర్ ఘర్ తిరంగా' స్ఫూర్తితో జాతీయ జెండాల పంపిణీ చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు.అనంతరం చిన్నారులు, పెద్దలకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు మైనారిటీ నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్నప్రసాద పథకానికి లక్ష విరళం

**- ధాతకు బాండ్ అంధచేస్తున ఆలయ ఎ.ఇ.ఓ**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) దేవస్థానం అన్నదాన పథకానికి ఎం.త్రిలోకనాథ్ రెడ్డి, హైదరాబాద్ వాస్తవ్యులు 1,00,116/ బి లను ఆలయ ఎ.ఇ.ఓ.ఫణింద్ర ప్రసాద్ కు అంధజైషారు.దాతకు తగు రాశిధు, ప్రసాదాలు, శేషవస్త్రాలు అందచేశారు.

## రోడ్డు ప్రమాద మృతుడు, తెలంగాణ ఉద్యమకారుడి కుటుంబాలను పరామర్శించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయ గౌడ్



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు శివకుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలుసుకున్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సుహాసిని రెడ్డి నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని పోస్టుమార్టం ప్రక్రియను పరిశీలించారు. అనంతరం మృతదేహానికి నివాళులర్పించి, శివకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.అదేవిధంగా, నర్సాపూర్ పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మన్నే వీరేశం మరణించిన విషయం తెలుసుకుని, వారి పార్థివదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వీరేశం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని ఓదార్పునిచ్చారు.ఈ సందర్భంగా మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## శ్రీశైలం దేవస్థానం లో శ్రావణమాసం సందర్భంగా

# శివచతుస్సప్తాహ భజనలు



**శ్రీశైలం (ప్రశ్న న్యూస్)** లోక కల్యాణం కోసం ప్రతీ సంవత్సరం శ్రావణ, కార్తికమాసాలలో దేవస్థానం అఖండ శివ భజనలు నిర్వహిస్తోంది. అంటే నెలంతా రేయింబవళ్లు నిరంతరంగా ఈ భజన సాగుతుంది. ఈ పవిత్ర అఖండ భజనలు శ్రావణమాస ప్రారంభం సందర్భంగా ఆలయప్రాంగణంలోని వీరశిరోమండపంలో (13.08.2026)ప్రారంభమయ్యాయి. భాద్రపద శుక్ల పాడ్యమి ఉదయం(12.09.2026)న ముగించబడుతాయి.ఈ ప్రారంభ కార్యక్రమములో ధర్మకర్తల మండలి అధ్యక్షులు పోతుగుంట రమేష్‌నాయుడు, శ్రీస్వామివారి ప్రధానార్చకులు హెచ్. వీరయ్యస్వామి, అర్చకస్వాములు, అధికారులు పాల్గొన్నారు. కాగా ఈ భజనలో ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సంకల్పాన్ని పఠించారు. అనంతరం భజనకార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజను జరిపించబడింది. ఆ తరువాత శాస్త్రోక్తంగాచండీశ్వరస్వామివారికి విశేషపూజలు జరిపించబడ్డాయి. ఈ పూజల అనంతరం శివప్రణవ పంచాక్షరీనామ భజనను ప్రారంభించబడింది. కాగా కర్నూలు నగరానికి చెందిన అయిదు భజన బృందాలకు, కర్ణాటకకు చెందిన రెండు భజన బృందాలకు ఈ శ్రావణమాస శివభజనలు చేయడానికి అవకాశం కల్పించబడింది.శ్రీసుంకులమ్మదేవి భజన మండలి వారు ( 13.08.2026 నుండి 17.08.2026వరకు), రామాంజనేయ భజనమండలివారు ( 17.08.2026 నుండి 21.07.2026 వరకు) శ్రీ లక్ష్మీ చెన్నకేశవ భజన బృందం వారు ( 21.08.2026 నుండి 25.08.2026 వరకు ) , శ్రీ లక్ష్మీ చెన్నకేశవ నాటక కళా భజన మండలి వారు ( 25.08.2026 నుండి 29.08.2026 వరకు ) శ్రీ గురునిమిషాంబాదేవి భజన మండలి వారు ( 29.08.2026 నుండి 02.08.2026 వరకు), మల్లికార్జున భజన సంఘం, సుంకేశ్వరాహాల్, రాయచూరు జిల్లా మరియు ప్రభులింగ సేవా సంఘం, గోపన దేవర హళ్లి, రాయచూరు జిల్లా, కర్ణాటక రాష్ట్రం వారు ( 02.09.2026 నుండి 12.09.2026 వరకు ) ఈ అఖండ శివభజనలలో పాల్గొంటున్నారు.

# ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంతో పునఃసర్వే

**- లైసెన్స్‌డ్ సర్వేయర్లను భూ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం**

**- పునఃసర్వే పని కోసం 20 మంది అర్హులైన అభ్యర్థులకు లైసెన్సులు జారీ**

**- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడమే లక్ష్యంతో పునఃసర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్ లైసెన్స్ సర్వేయర్లను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ చాంబర్లో జిల్లాలో పునఃసర్వే పనులు చేపట్టేందుకు నిర్దేశిత అర్హత/శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 20 మంది అర్హులైన అభ్యర్థులకు సర్వే మరియు భూ రికార్డుల శాఖకు చెందిన సంబంధిత అధికారుల సమక్షంలో ఎంపికైన అభ్యర్థులకు లైసెన్సులను లాంఛనంగా అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూమి రికార్డులను నవీకరించడం మరియుమెరుగుపరచడం, ఖచ్చితమైన సర్వే సరిహద్దులను స్థాపించడం, మరియు భూ యజమానులకు, ప్రజలకు విశ్వసనీయమైన సర్వే సమాచారాన్ని అందించడం అనే లక్ష్యంతో పునఃసర్వే కార్యక్రమాన్ని చేపట్టాలని,.లైసెన్స్ పొందిన సర్వే అభ్యర్థులు, సర్వే మరియు భూ రికార్డుల శాఖ నిర్దేశించిన సాంకేతిక విధానాలు, నియమాలు మరియు సూచనల ప్రకారం పునఃసర్వే కార్యకలాపాలను నిర్వహించడంలో సహాయపడతారని. సర్వేయర్లు తమ విధులను నిష్పక్షపాతంగా, కచ్చితంగా మరియు పారదర్శకంగా నిర్వర్తించాలని, అలాగే రెవెన్యూ మరియు సర్వే శాఖ అధికారులకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏడి ల్యాండ్ సర్వే కిషన్, సంబంధిత ల్యాండ్ సర్వీస్ సిబ్బంది లైసెన్స్ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# హర్ ఘర్ తిరంగా మహా బైక్ ర్యాలీ



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** మనదేశం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్న ఈతరుణంలో మన శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ సమగ్రతను,ఐక్యతను కాపాడుకుంటామని మనమందరం ప్రతిజ్ఞ చేయాల్సిన సమయమిది.ఈ ప్రత్యేక సందర్భంగా మన శ్రీకాళహస్తి నియోజకవర్గంలో హర్ ఘర్ తిరంగా మహా బైక్ ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించాం. కూటమి నాయకులు, కార్యకర్తలు,ఉత్సాహవంతులైన యువతతో కలిసి ఈ బైక్ ర్యాలీలో పాల్గొన్నాను స్థానిక ఏపీ సీడ్స్ నుంచి ఈ భారీ ర్యాలీ చారిత్రాత్మక నాలుగు మాడ వీధుల గుండా ఉత్సాహంగా సాగింది. వేలాది బైకులు, రెపరెపలాడే త్రివర్ణ పతాకాలతో పురవీధులన్నీ మువ్వన్నెల శోభను సంతరించుకున్నాయి. మన నియోజకవర్గ ప్రజల్లో కనిపించిన ఈ దేశభక్తి నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

# అమరులకు నివాళిగా సీఐటీయూ క్యాండిల్ ర్యాలీ



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్ )** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, సామ్రాజ్యవాద, మతోన్మాద వ్యతిరేక విధానాలకు నిరసనగా, ప్రజాస్వామ్య హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధులు, అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు సందేమైనా ఎల్లయ్య, బండ్ల స్వామి మాట్లాడుతూ కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు.ప్రజాస్వామ్య హక్కులను కాపాడుతూ, కార్మికులు--రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# రేషన్ కార్డులపై రాజకీయ నేతల ఫోటోలు ముద్రించడం సరికాదు

**- ప్రజా ధనం వృధా చేయడమే -- ఎన్.సి. సంతోష్**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** తెలంగాణ ప్రభుత్వం నూతనంగా పంపిణీ చేయనున్న రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫోటోలను ముద్రించడాన్ని బీఆర్ఎస్ పార్టీ సిద్దిపేట జిల్లా గజ్వేల్ సీనియర్ నాయకులు ఎన్.సి. సంతోష్ తీవ్రంగా తప్పుపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందించే గుర్తింపు కార్డులపై అధికారంలో ఉన్న రాజకీయ నాయకుల ఫోటోలు ముద్రించడం వల్ల భవిష్యత్‌లో ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్‌కు సంబంధించిన సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ కార్డులను మార్చడం లేదా కొత్తగా ముద్రించాల్సి వస్తే ప్రజాధనంపై అదనపు భారం పడుతుందని పేర్కొన్నారు.కేవలం రాజకీయ ప్రచారం కోసం ప్రజా ధనాన్ని వినియోగించడం సరికాదని ఆయన మండిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టులో కామన్ కాజ్ ప్రజా ప్రయోజన వ్యాజ్యం సహా, జార్ఖండ్ రాష్ట్రానికి సంబంధించిన కేసుల్లోనూ ప్రజాధనాన్ని రాజకీయ ప్రచారానికి వినియోగించడంపై న్యాయస్థానాలు అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.ప్రజా ధనాన్ని అనవసరమైన ప్రచార కార్యక్రమాలకు ఖర్చు చేయకుండా, సామాన్య ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు, ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజాధనం వృథా అయ్యే విధానాలకు స్వస్తి పలికి, ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎన్.సి. సంతోష్ కోరారు.

# గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా హర్ ఘర్ తిరంగా

**- "నా తిరంగా -- నా గర్వం" అంటూ దేశభక్తిని చాటుకున్న విద్యార్థినులు**




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )**దేశభక్తి భావాన్ని పెంపొందించడం, జాతీయ సమైక్యతను బలోపేతం చేయడం, జాతీయ జెండాపై గౌరవం, దేశంపై గర్వభావాన్ని విద్యార్థినుల్లో పెంపొందించడమే లక్ష్యంగా గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.జాతీయ సేవా పథకం యూనిట్లు--1, 2 ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని తమ దేశభక్తిని చాటుకున్నారు.

### "నా తిరంగా -- నా గర్వం"పై చిత్రలేఖనం

కార్యక్రమంలో భాగంగా "హర్ ఘర్ తిరంగా -- నా తిరంగా, నా గర్వం" అనే అంశంపై చిత్రలేఖన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ జెండాలోని కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగులను మాత్రమే ఉపయోగించి విద్యార్థినులు వివిధ చిత్రాలను రూపొందించారు. విద్యార్థినులు రూపొందించిన చిత్రాలను కళాశాలలో ప్రదర్శించారు.


### తిరంగాతో స్వీయచిత్రాలు

విద్యార్థినులు, అధ్యాపకులు జాతీయ జెండాతో గౌరవప్రదంగా స్వీయచిత్రాలు తీసుకుని, అందుబాటులో ఉంచిన సంకేత చిహ్నాన్ని స్కాన్ చేసి అంతర్జాలంలో తమ చిత్రాలను నమోదు చేసుకున్నారు. అనంతరం ధ్రువపత్రాలను పొందారు.

### దేశభక్తి ప్రతి ఇంటికీ చేరాలి

జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కేవలం జాతీయ జెండాను ఎగురవేయడం మాత్రమే కాదని, దేశం పట్ల మన బాధ్యత, ఐక్యత, గర్వాన్ని వ్యక్తపరిచే గొప్ప కార్యక్రమమని తెలిపారు. విద్యార్థినులు తమ కుటుంబ సభ్యులతో పాటు సమాజంలోని ఇతరులకు కూడా హర్ ఘర్ తిరంగా సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు."తిరంగా మన జాతీయ గౌరవానికి ప్రతీక"కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ, విద్యార్థినుల్లో దేశభక్తి, జాతీయ సమైక్యత, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో కీలకమని అన్నారు."తిరంగా మన జాతీయ గౌరవానికి ప్రతీక. ప్రతి విద్యార్థి హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వామి కావడం ద్వారా దేశం పట్ల తన బాధ్యతను చాటుకోవాలి" అని పిలుపునిచ్చారు.జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డా. పి. సౌజన్య (యూనిట్--1), డా. కె. సరోజ (యూనిట్--2) విద్యార్థినులను సమన్వయం చేస్తూ కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# 100 మీటర్ల జాతీయ పతాకంతో హర్ ఘర్ తిరంగా



విశాఖపట్నం(ప్రశ్న న్యూస్) విశాఖ బీచ్ రోడ్డులో శుక్రవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ ఉత్సాహంగా సాగింది. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తి భావాలను ప్రజల్లో మరింతగా పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు ఈ ర్యాలీ నిర్వహించారు.కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు సాగిన ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వర నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులు, అధికారులు, ప్రజలతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని 100 మీటర్ల పొడవైన జాతీయ పతాకాన్ని చేతబట్టి ముందుకు సాగారు.దేశభక్తి గీతాలు, 'భారత్ మాతాకీ జై', 'వందే మాతరం' నినాదాలతో బీచ్ రోడ్డు మార్మోగింది. త్రివర్ణ పతాకాల రెపరెపలు, విద్యార్థుల ఉత్సాహం ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ జాతీయ ఐక్యత, సామరస్య భావాలను చాటుతూ ర్యాలీ కొనసాగింది.వికసిత్ భారత్--స్వర్ణాంధ్ర ఏ2047 లక్ష్య సాధన, అభివృద్ధి చెందిన భారత నిర్మాణం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల స్ఫూర్తిని నేటి తరానికి అందించడంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం కీలకమని నిర్వాహకులు తెలిపారు.ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశాభిమానాన్ని చాటాలని, యువతలో జాతీయ చైతన్యాన్ని మరింత పెంపొందించాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారిణి జె. మాధవి, డీవీఎం జగదీష్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్, సమాచార శాఖ ఆర్జేడీ కె. సదారావు, హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పవన్ కార్తీక్, రవాణా, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# తిరుమలలో గదుల దందా..

## దళారీలకు భక్తుల వసతే వ్యాపారం

- తక్కువ ధరకు గదులు.. అవసరంలో ఉన్న భక్తులకు అధిక ధరలకు విక్రయం.? - బుకింగ్ విధానాన్ని అడ్డుపెట్టుకుని మధ్యవర్తుల జోరు వ్యాపారం
- తిరుమలలో పెరుగుతున్న దళారి వ్యవస్థపై నిఘా పెంచాలంటున్న భక్తులు - బుకింగ్ డేటా, మొబైల్ నంబర్లు, చెల్లింపులపై సమగ్ర పరిశీలనకు డిమాండ్
- పాలకమండలి, అధికార యంత్రాంగం కఠినంగా వ్యవహరిస్తే వసతి సమస్యకు శాశ్వత పరిష్కారం







తిరుమల(ప్రశ్న న్యూస్ ) కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుంచి తిరుమలకు వచ్చే సామాన్య భక్తులకు వసతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన గదులే కొందరు దళారీలకు అక్రమ సంపాదన మార్గాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. భక్తుల పేర్లతో వసతి గదులను పొందడం.. ఆ తర్వాత అవసరంలో ఉన్న భక్తులకు అధిక ధరలకు అప్పగించడం లేదా బ్లాక్‌లో విక్రయించడం వంటి వ్యవహారాలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తిరుమలలో వసతి కొరతను ఆసరాగా చేసుకుని కొందరు మధ్యవర్తులు చురుగ్గా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఎప్పటికప్పుడు తెరపైకి వస్తున్న



నేపథ్యంలో టీటీడీ యంత్రాంగం మరింత కఠినమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది.

### భక్తుల పేరుతో.. దళారీల దందా.?

తిరుమలలో గది పొందడం సామాన్య భక్తులకు ముఖ్యమైన అంశం. ముఖ్యంగా రద్దీ రోజులు, పర్వదినాలు, వారాంతాల్లో వసతి కోసం భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు.

ఇలాంటి పరిస్థితుల్లో ముందుగానే గదులు పొందే కొందరు వ్యక్తులు వాటిని అవసరంలో ఉన్న వారికి అధిక ధరలకు అప్పగిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్న విజిలెన్స్ విభాగం మాత్రం దానిపై దృష్టి పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిజంగా గది అవసరమైన భక్తుడికి దక్కాల్సిన వసతి, మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లి అదనపు ఆదాయ వనరుగా మారితే అది భక్తులపై ప్రత్యక్ష భారం మోపినట్లేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఒకే వ్యక్తి.. పదేపదే బుకింగ్.?

గదుల అక్రమ వినియోగాన్ని గుర్తించేందుకు బుకింగ్ విధానాన్ని లోతుగా విశ్లేషించాల్సిన అవసరం ఉందని భక్తులు టీటీడీ పాలక మండలికి సూచిస్తున్నారు. ఒకే మొబైల్ నంబర్, ఒకే గుర్తింపు వివరాలు లేదా ఒకే కుటుంబ సభ్యుల పేర్లతో పదేపదే గదులు బుక్ అవుతున్నాయా.? ఒకే వ్యక్తి తరచూ వసతి సదుపాయం పొందుతున్నాడా.? వంటి అంశాలను పరిశీలిస్తే అనుమానాస్పద బుకింగ్‌లను గుర్తించే అవకాశం ఉంటుందని దీనిపై టిటిడి అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రత్యేకంగా తక్కువ వ్యవధిలో వరుసగా గదులు పొందుతున్న ఖాతాలు, రద్దీ సమయాల్లో పెద్ద సంఖ్యలో బుకింగ్‌లు చేసే వ్యక్తులు, బుకింగ్ చేసిన తర్వాత గదిని వినియోగించకుండా ఇతరులకు అప్పగించే ప్రయత్నాలు వంటి అంశాలపై ప్రత్యేక అల్గారిథమ్‌తో నిఘా పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

### ఆధార్.. మొబైల్ నంబర్.. బుకింగ్ చరిత్ర

గదుల బుకింగ్ సమయంలో నమోదయ్యే గుర్తింపు వివరాలను కేవలం వసతి కేటాయింపునకు మాత్రమే కాకుండా అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు టీటీడీ అధికారులు ఉపయోగించాల్సిన అవసరం ఉంది. ఆధార్ లేదా ఇతర గుర్తింపు వివరాలు, మొబైల్ నంబర్లు, బుకింగ్ తేదీలు, చెక్‌ఇన్ వివరాలు, గది వినియోగించిన వ్యక్తుల వివరాలను నిబంధనలకు అనుగుణంగా విశ్లేషిస్తే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించవచ్చు.అయితే భక్తుల వ్యక్తిగత సమాచార రక్షణకు ప్రాధాన్యం ఇస్తూనే చట్టబద్ధమైన విధానంలో మాత్రమే ఈ పరిశీలన జరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

### బుకింగ్ నుంచి చెక్‌ఇన్ వరకు..

దళారీ వ్యవస్థను అరికట్టాలంటే కేవలం బుకింగ్ సమయంలోనే తనిఖీలు నిర్వహించడం సరిపోదని పలువురు అభిప్రాయపడుతున్నారు. గది బుక్ చేసిన వ్యక్తి ఎవరు.?

చెక్‌ఇన్ సమయంలో గదిని వినియోగిస్తున్న వ్యక్తి ఎవరు.? బుకింగ్ చేసిన వ్యక్తికి, గదిలో ఉంటున్న వ్యక్తికి సంబంధం ఏమిటి.? వంటి అంశాలను నిబంధనల పరిధిలో పరిశీలించాలి.బుకింగ్ చేసిన వ్యక్తి గైర్హాజరై మరొకరిని గదిలోకి అనుమతించే ప్రయత్నాలు జరుగుతున్నాయా.? నిబంధనలకు విరుద్ధంగా గదిని ఇతరులకు బదిలీ చేస్తున్నారా.? అనే అంశాలపై వసతి విభాగం, విజిలెన్స్ అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. అయితే ఈ తట్టంగామంతా కొంతమంది అధికారులకు తెలిసిన మౌనంగా ఉంటున్నారన్న విమర్శలు లేకపోలేదు.





### అధిక ధరలకు గదుల విక్రయం.?

తిరుమలలో వసతి దొరకక కుటుంబాలతో అనేక ఇబ్బంది పడుతున్న భక్తుల అత్యవసర పరిస్థితిని కొందరు దళారులు సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. సాధారణంగా నిర్ణయించిన అద్దెకు గది లభించాల్సి ఉండగా.. అదే గదిని బయట అధిక ధరకు ఇప్పిస్తామని చెప్పే మధ్యవర్తుల వ్యవస్థ జోరుగా సాగుతుందని దానిపై టీటీడీ పాలకమండలి, అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.అసలు గది అద్దె ఎంత.? దళారీ కోరుతున్న మొత్తం ఎంత.? అదనపు నగదు ఏ రూపంలో తీసుకుంటున్నారు.? ఆన్‌లైన్ చెల్లింపులు జరుగుతున్నాయా.? వంటి అంశాలను పరిశీలించడం ద్వారా అక్రమ వసతి వ్యాపారానికి అడ్డుకట్ట వేయవచ్చని భక్తులు సూచిస్తున్నారు.

### డిజిటల్ చెల్లింపులపై నిఘా..

గదుల అక్రమ విక్రయాలు లేదా బదిలీలకు సంబంధించి డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నట్లయితే వాటి ఆధారంగా అక్రమ వ్యవహారాలను గుర్తించే అవకాశం ఉంటుంది. అయితే ఇందుకు సంబంధించి చట్టపరమైన అధికార పరిధిలోనే విచారణ జరగాలి. ఫిర్యాదులు అందిన సందర్భాల్లో సంబంధిత చెల్లింపుల ఆధారాలు, సంభాషణలు, బుకింగ్ వివరాలు వంటి సమాచారాన్ని సేకరించి వెంటనే దర్యాప్తు చేయాలి.

### ఉద్యోగుల సహకారం ఉందా.?

గదుల కేటాయింపు ప్రక్రియలో బయట వ్యక్తులు మాత్రమే కాకుండా ఎవరైనా ఉద్యోగులు అంతర్గతంగా సహకరిస్తున్నారా.? అనే కోణంలోనూ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. బుకింగ్ సమాచారం ముందుగానే బయటకు వెళ్తోందా? ప్రత్యేక సమయాల్లో కొందరికి మాత్రమే గదులు లభిస్తున్నాయా.? అనుమానాస్పద బుకింగ్‌లను ఎవరైనా నిరంతరం నిర్వహిస్తున్నారా.? వంటి అంశాలపై అంతర్గత పరిశీలన చాలా అవసరం.అయితే నిర్ధారణ కాని ఆరోపణలను నిజాలుగా ప్రచారం చేయకుండా, ఆధారాలతో మాత్రమే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

### సీసీ కెమెరాలే కీలకం..

వసతి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వ్యవస్థను సమర్థంగా వినియోగించడం ద్వారా అనుమానాస్పద కదలికలను గుర్తించవచ్చు. బుకింగ్ చేసిన వ్యక్తి కాకుండా మరొకరు గదిని వినియోగించేందుకు ప్రయత్నిస్తున్న సందర్భాలు, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న వ్యక్తుల కదలికలు వంటి అంశాలను నిబంధనల మేరకు పరిశీలించవచ్చు.ఫిర్యాదు వచ్చిన ప్రతిసారీ సంబంధిత తేదీ, సమయం, బుకింగ్ వివరాలను అనుసంధానం చేసి సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలించే వ్యవస్థను మరింత పటిష్ఠం చేయాలని భక్తులు కోరుతున్నారు.

### ప్రత్యేక నిఘా బృందం అవసరం..

తిరుమలలో గదుల అక్రమ బదిలీ, అధిక ధరలకు వసతి కల్పించడం వంటి ఆరోపణలను పరిశీలించేందుకు టీటీడీ విజిలెన్స్, వసతి విభాగం, పోలీసు యంత్రాంగం సమన్వయంతో ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. రద్దీ రోజుల్లో ప్రత్యేకంగా నిఘా పెంచి, అనుమానాస్పద బుకింగ్‌లను గుర్తించి విచారణ చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వసతి గదులను నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు బదిలీ చేయడం, దళారుల ద్వారా విక్రయించడం వంటి చర్యలు నిర్ధారణ అయితే సంబంధిత వ్యక్తులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే భవిష్యత్ బుకింగ్ సదుపాయాలపై ఆంక్షలు విధించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం వల్ల అక్రమ బుకింగ్ వ్యవహారమును కట్టడి చేయవచ్చని భక్తులు సూచిస్తున్నారు.

### భక్తుల వసతి.. దళారీల వ్యాపారం కాదు..

తిరుమలలో గది అనేది కేవలం ఒక వాణిజ్య వస్తువు కాదని, శ్రీవారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తునికి అందించాల్సిన ప్రాథమిక వసతి సదుపాయమని భక్తులు పేర్కొంటున్నారు. గదుల కేటాయింపులో పారదర్శకత పెంచి, దళారీల జోక్యానికి పూర్తిగా అడ్డుకట్ట టీటీడీ వేయాలని కోరుతున్నారు.భక్తుడి వసతి హక్కు.. దళారీకి వ్యాపార వస్తువు కాదు" అనే సూత్రంతో టీటీడీ యంత్రాంగం వ్యవహరించాలని భక్తులు కోరుతున్నారు. బుకింగ్ వ్యవస్థలో సాంకేతిక పర్యవేక్షణ, చెక్‌ఇన్ సమయంలో సమర్థ తనిఖీలు, ఫిర్యాదులపై వేగవంతమైన విచారణ, అక్రమాలు నిర్ధారణ అయితే కఠిన చర్యలు,ఈ నాలుగు అంశాలపై చంద్రబాబు ప్రభుత్వం, టిటిడి పాలకమండలి, అధికారులు దృష్టి పెడితే తిరుమలలో గది దళారీ వ్యవస్థకు పూర్తిగా చెక్ పెట్టే అవకాశం ఉంటుంది.భక్తులకు అందాల్సిన వసతి ఎలాంటి మధ్యవర్తిత్వానికి తావులేకుండా నేరుగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవడం ఇప్పుడు టీటీడీ ముందు ఉన్న ప్రధాన బాధ్యతగా మారింది. మరి దీనిపై టీటీడీ పాలకమండలి, అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

# గ్యాస్ పైప్ కొంటేనే

# ఈ-కేవైసీ చేస్తామంటూ బెదిరింపులు




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** గ్యాస్ వినియోగదారుల ఈ-కేవైసీ ప్రక్రియను ఆసరాగా చేసుకుని గజ్వేల్ పట్టణంలోని 'శేషమా ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్' వినియోగదారుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. రూ.200కు గ్యాస్ పైప్ కొనుగోలు చేస్తేనే ఈ-కేవైసీ చేస్తామని, లేకపోతే చేయబోమని ఏజెన్సీ సిబ్బంది చెబుతున్నారని వినియోగదారులు వాపోతున్నారు.ప్రభుత్వం నిర్ణయించిన గడువు సమీపిస్తున్న నేపథ్యంలో గ్యాస్ సబ్సిడీ నిలిచిపోతుందేమోనన్న ఆందోళనతో గజ్వేల్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి వృద్ధులు, మహిళలు, నిరక్షరాస్యులు పెద్ద సంఖ్యలో ఏజెన్సీ కార్యాలయానికి వస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని వారు ఉదయం నుంచి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ-కేవైసీ ప్రక్రియను వినియోగదారులు అధికారిక డిజిటల్ మార్గాల్లో లేదా సంబంధిత గ్యాస్ ఏజెన్సీలో బయోమెట్రిక్ విధానంలో పూర్తి చేసుకునే అవకాశం ఉంది. అయితే, శేషమా ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో మాత్రం గ్యాస్ పైప్ కొనుగోలును తప్పనిసరి చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.ఉచితంగా అందాల్సిన ఈ-కేవైసీ సేవకు షరతులు విధించడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. సబ్సిడీ నిలిచిపోతుందనే భయాన్ని ఆసరాగా చేసుకుని పేద వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్న ఏజెన్సీపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమైతే కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.గడువు సమీపిస్తున్న నేపథ్యంలో గజ్వేల్ మండల ప్రజలకు ఎలాంటి అదనపు కొనుగోళ్ల షరతులు లేకుండా ఈ-కేవైసీ పూర్తి చేసేలా పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందులపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# రాష్ట్రపతి ప్రసంగం దేశ బలానికి నిదర్శనం

## - స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంపై రాష్ట్రపతికి ప్రధాని మోదీ ప్రశంసలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతినుద్దేశించి చేసిన ప్రసంగంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాష్ట్రపతి ప్రసంగంలోని ఆలోచనలు దేశ బలానికి, ప్రతి భారతీయుడి ఆకాంక్షలకు నిదర్శనమని ఆయన కొనియాడారు. శుక్రవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని స్పందించారు. "స్వాతంత్ర్య దినోత్సవ వేళ రాష్ట్రపతి చాలా ఉత్తేజకరమైన, ఆలోచింపజేసే ప్రసంగం చేశారు. ఆమె ఆలోచనలు మన దేశ శక్తిని, ప్రతి భారతీయుడి ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వికసిత భారత్ నిర్మాణం కోసం పునరంకిత భావంతో పనిచేయడానికి ఆమె సందేశం మనందరికీ స్ఫూర్తినిస్తుంది" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు.

అంతకుముందు, తన ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గత దశాబ్ద కాలంలో దేశం సాధించిన ప్రగతిని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ, భారతదేశం వేగవంతమైన, సమ్మిళిత ఆర్థిక వృద్ధిని సాధించిందని తెలిపారు. "వికాస్ మరియు విరాసత్" (అభివృద్ధి, వారసత్వం) సమన్వయంతో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. 'వికసిత భారత్ ఏ 2047' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రజలందరూ సమష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలు, యువత, పేదలు, రైతుల సంక్షేమ పథకాలను రాష్ట్రపతి ప్రముఖంగా ప్రస్తావించారు. గత పదేళ్లలో 25 కోట్లకు పైగా ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని గుర్తుచేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక సమ్మిళిత పథకమైన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' కింద సుమారు 59 కోట్ల మంది బ్యాంకు ఖాతాలు తెరిచారని, వీరిలో 32 కోట్లకు పైగా మహిళలు ఉన్నారని వివరించారు. మహిళా రిజర్వేషన్ చట్టం ద్వారా రాజకీయాల్లో వారి భాగస్వామ్యం పెరిగిందని, ఇది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తోందని అన్నారు.ఇటీవల జరిగిన పేపర్ లీక్ ఘటనలను ప్రస్తావిస్తూ, పరీక్షా వ్యవస్థలో అవకతవకలను అరికట్టి, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని యువతకు భరోసా ఇచ్చారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ అవకాశాలు మెరుగయ్యాయని తెలిపారు. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారేనని, వారి శక్తితో స్టార్టప్ వ్యవస్థ దేశ స్వర్ణ భవిష్యత్తుకు బాటలు వేస్తోందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ప్రపంచ యవనికపై భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టేందుకు పౌరులందరూ తమ వంతు కృషి చేయాలని రాష్ట్రపతి తన ప్రసంగంలో పిలుపునిచ్చారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588